# జీవితాన్ని ధన్యం చేసుకోవాలంటే?



రచన: బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

# జీవితాన్ని ధన్యం చేసుకోవాలంటే?



**రచన : బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి**

మొదటి ముద్రణ : మే 2026

ప్రతులు : 1,000

**వెల : రూ. 60/-**

**పుస్తకముల కొరకు :-**

**తటవర్తి వీరరాఘవరావు,**

**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.**

**సెల్ : 94901 71853, 9440309812**

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 11) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 12) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 13) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 14) పంచకోశాలు | - | రూ.60/- |
| 15) మనస్సు యొక్క స్థితులు | - | రూ.60/- |
| 16) ధార్మిక జీవితం అంటే? | - | రూ.60/- |
| 17) జీవితం ధన్యం చేసుకోవాలంటే? | - | రూ.60/- |
| 18) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 19) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 20) చిత్తం శాంతిగా వుండాలంటే? | - | రూ.50/- |
| 21) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 22) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**
**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**
**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|

# జీవితాన్ని ధన్యం చేసుకోవాలంటే?

మానవుడిగా ఎప్పుడు గుర్తింప బడతారు అన్న విషయం తెలుసుకుందాం.

ప్రాపంచిక జీవితంలో చూడటానికి అందరూ మానవులుగా ఉన్నా మరి పైలోకాల నుంచి క్రిందకు వచ్చినప్పుడు మానవ జీవితం యొక్క ప్రత్యేకత ఏమిటో తెలుసుకునే వస్తారు. మరి మానవుడు మానవుడిగా ఎప్పుడు గుర్తింప బడతాడు అంటే ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చాక. మానవుడు తాను ఆత్మని అని ఎరుకతో జీవించినప్పుడు మానవుడిగా గుర్తింప బడతాడు.

ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చిన దగ్గర నుంచి తాను దేహము కాదు, తాను ఆత్మని అనే ఎరుక కలిగి ఉండాలి. ఎందుకంటే ప్రాపంచిక జీవితంలో ఈ సత్యాన్ని బోధించే వాళ్ళు లేరు. కానీ సద్గురు వచ్చి **"నువ్వు శరీరం కాదు, నువ్వు ఆత్మవి"** అన్న సత్యాన్ని బోధించినప్పుడు మీరు మానవుడిగా అందరికీ కనిపించవచ్చు కానీ మీకు మీరుగా నేను ఆత్మని అని తెలుసుకోగలగాలి. ఆత్మ అన్నట్టుగా ప్రవర్తించగలగాలి.

మానవ అంటే అర్థం? 'మా' అంటే మరుజన్మ, 'న' అంటే లేకుండా, 'వ' అంటే వర్తించడం అంటే ప్రవర్తించడం.

మరి మరుజన్మ లేకుండా ప్రవర్తించాలి అంటే? ఎలాంటి జీవితం జీవిస్తే మరుజన్మ లేకుండా ఉండగలరు? అంటే సద్గురువులు వచ్చి ధ్యాన సాధన, జ్ఞానం రెండు చెప్పినప్పుడు. నేను ఆత్మని అని తెలుసుకుని ఆ ఆత్మని అనుభవంలోకి తెచ్చుకోవాలి, దానికోసం ధ్యాన సాధన చేయాలి, గురువు ద్వారా జ్ఞానం వింటూ ఉండాలి.

మరి గురువులు ఎన్నో రకాలుగా ఈ జ్ఞానాన్ని బోధిస్తారు. ఇప్పుడు మీరందరూ కూడా ప్రతిరోజూ ఎన్నో జ్ఞానపరమైన విషయాలు వింటున్నారు.

“నేను ఆత్మ” అని మర్చిపోకుండా ఉండడానికే గురువులు ఈ విషయాలు చెప్తూ ఉంటారు.

ఎందుకంటే నిద్ర నుంచి లేచాక మీరు దేహం అనే భ్రాంతిలో కొట్టుకుపోకుండా మళ్ళా ఇలాంటి విషయాలు చెప్పి మీకు మరుజన్మ లేకుండా ఉండేందుకు గురువులు ప్రయత్నిస్తూ వుంటారు.

మరి “నేను దేహం కాదు”, “నేను ఆత్మని” అనుకున్నప్పుడు చాలా ధైర్యంగా ఉంటారు, నేను భగవంతుడిని అని అనుకుంటే అహంకారం రాదు. ఒక అజ్ఞాని నువ్వు భగవంతుడు అంటే అహంకారం పెంచుకుంటాడు. ఒక జ్ఞాని నేను భగవంతుడిని అని అనుకున్నపుడు, భగవంతుడు అనే పదానికి అర్థం ఏమిటో తెలుసుకొని భగవంతుని లాగే నీవు కూడా విశ్వానికి ఎంత ఇవ్వగలవో అంత ఇస్తావు.

నువ్వు భగవంతుడిని అని గురువు చెప్పినప్పుడు, జ్ఞాని నేను ఈ మాయకి వశమై జీవుడిని అని అనుకున్నాను అని అర్థం చేసుకుంటాడు. కానీ నేను దేవుడిని అంటే “అహం బ్రహ్మోస్మి” అని అనుకున్నప్పుడు ధైర్యంగా ఉంటావు. కాని నేను “దేహం “అని అనుకున్నప్పుడు భయపడతావు, అంతే తేడా.

ఎవరైతే ధైర్యవంతులో వారు ఆత్మ స్థితిలో ఉంటారు. అది అహంకారంతో వచ్చే ధైర్యం కాదు, ఆత్మశక్తితో వచ్చే ధైర్యం. ఇక్కడ గమనిస్తే అహంకారంతో నేను ఏం చేసినా చెల్లుతుంది అనుకున్నవాడు తప్పుడు పనులు చేస్తాడు.

కానీ ఆత్మ జ్ఞానంతో నేను ఆత్మని అన్న సత్యాన్ని తెలుసుకున్న ధైర్యవంతుడు, విశ్వ కళ్యాణం కోసం పాటుపడుతూ ఉంటాడు. అంటే దైవం ఎలా ప్రవర్తిస్తాడో జ్ఞాని కూడా అలాగే ప్రవర్తిస్తాడు.

ఎప్పుడైతే గురువు వచ్చాక నువ్వు ఆత్మవి అని తెలుసుకున్నాక,

సాధన మొదలు పెట్టినప్పటి నుంచి మీ బలహీనతలు అన్నిటిని తొలగించుకోవడానికి ప్రయత్నిస్తారు. ఎందుకంటే భయం వల్లే బలహీనతలు ఉంటాయి, వాటిని తొలగించుకున్న క్షణం నుంచి మీరు ఇంకా ముందుకి ఎదుగుతూ ఉంటారు.

అంటే నేను "పై పొట్టుని" అని అనుకుంటే నీచభావం, నేను "గింజని" అనుకుంటే ధైర్యం అంటే ఈ ఉపమానాలు మహాత్ములు ఎందుకు చెప్పారంటే ఏ గింజయినా పై పొట్టుతో ఉంటుంది. కానీ పైపొట్టు దానికి కవచంలా ఉపయోగపడుతుంది, కానీ పైపొట్టు దేనికి పనికి రాదు.

ఆ గింజే భూమిలో నాటితే మహా వృక్షం అవుతుంది. అందుకే నేను పైపొట్టును కాదు అంటే ఎంత అర్థంతో మాట్లాడారో చూడండి. నేను శరీరం అనుకుంటే పైపొట్టుని నేను విత్తనాన్ని అనుకుంటే నేను దైవాన్ని అవుతాను.

ఆత్మ అనే విత్తనానికి ఈ శరీరం అనే పై పొట్టు ఉంది, కానీ ఈ పొట్టు ఇక్కడే వదిలేస్తారు, ఈ ఆత్మను పైలోకాలకు తీసుకువెళ్తారు. అలాగే ఎప్పుడూ కూడా నువ్వు పై పొట్టు అనే హీన భావంతో ఉండొద్దు, అలా ఉన్నప్పుడు నువ్వు ఇంకా దిగజారిపోతావు. నేను విత్తనాన్ని, మహా వృక్షాన్ని ఇవ్వగలిగే శక్తి ఉంది అని అనుకుంటే నీ అంతర్ ప్రేరణ విజృంభిస్తుంది.

ఎప్పుడైతే నేను ఆత్మని అనుకుంటావో అప్పుడు నీ అంతర్ ప్రేరణ అంటే ఆత్మ నుంచి వచ్చే సంకేతాలు సందేశాలు నువ్వు అందుకోగలుగుతావు.

ఈరోజు రాఘవరావు గారు ఇన్ని పుస్తకాలు వ్రాయగలుగుతున్నారంటే ఆయన అంతర్ప్రేరణ. ఎప్పుడైతే ఏ వ్యక్తికైనా అంతర్ప్రేరణ అందుతుందో ఆ వ్యక్తి ఉత్సాహం పొందగలుగుతాడు. రాఘవరావు గారికి చూడండి ఎప్పుడూ ఈ ఆత్మజ్ఞానం పనులు చేయడానికి అలసట ఉండదు. నేనైనా కొంచెం పని చేస్తే అలసి పోతాను, ఓ 10 నిమిషాలు నిలబడితే అలసిపోతాను, నడిస్తే

అలసిపోతాను అన్నిటికీ అలసట ఉంటుంది.

ఆత్మ ప్రేరణ ఉంది, కానీ శరీరం ఫైర్ ఆక్సిడెంట్ వల్ల అలా ఉంటుంది. కానీ ఎప్పుడైతే నేను ఆత్మని అని అనుకున్నప్పుడు ఉత్సాహం వస్తుంది. అంతేకాదు నేను దైవాన్ని అని అనుకున్నప్పుడు శక్తిని ఫీల్ అవుతాము. నేను శరీరం అనుకుంటే శక్తి అంతా నిర్వీర్యం అయిపోతుంది .

అందుకే ఎవరైతే నేను ఆత్మని అని అనుకుంటారో! వారికి అంతర్ ప్రేరణ ఉంటుంది, అప్పుడు వారు ధైర్యవంతులు అవుతారు. సహజంగా సత్యం తెలియకపోవడం వల్లే భేద భావం ఉంటుంది. అందుకే శరీరాలు చూస్తున్నంతసేపు వేరే వేరే అనే భేద భావం ఉంటుంది, అంటే మీరు ఇంకా ద్వైతంలో ఉన్నట్టు. కాని భేద భావం ఎప్పుడైతే పోతుందో అప్పుడు అద్వైతంలో ఉన్నట్టు. అందుచేత మీరు దైవాలమని అనుకుంటూ ఇవ్వడమే కానీ, తీసుకోవడం చెయ్యకూడదు.

ఈ ధ్యాన మార్గంలోకి వచ్చాక కోరికలు, వాసనలు ఉండకూడదు, సత్యాన్ని తెలుసుకోవాలి. ప్రాపంచిక కోరికల కోసం సాధన చేస్తే మీ శక్తి వాటి కోసమే ఖర్చు పెడతారు. అందుచేత మీరు వదిలి వెళ్ళేవి కాకుండా, కూడా తీసుకు వెళ్ళేవే సంపాదించుకోవాలి.

చూడండి పొలం ఎండిపోయింది అనుకోండి, వర్షం పడగానే గడ్డి మొలుస్తుంది. మరి ఎందుకు మొలిచింది? అంటే ఆ భూమిలో దాని విత్తనం ఉండిపోయింది. అందువల్ల గడ్డి మొలుస్తుంది. మీరు కూడా అంతే, ధ్యానం చెయ్యడం వల్ల కోరికలు తగ్గి, ఎన్నో విషయాలు తెలుసుకుంటారు, అందరికి చెపుతూ ఉంటారు.

కానీ ప్రపంచంలోకి వెళ్లి ఇంద్రియాల ద్వారా చూస్తున్నప్పుడు, మాట్లాడుతున్నప్పుడు, వింటున్నప్పుడు మీలో ఉన్న వాసనలు ఏదో ఒక టైంలో విజ్రంభిస్తూ ఉంటాయి, అవి విజ్రంభించి నప్పుడు మీరు గుర్తించలేరు.

నీ చుట్టూ ఏమి జరుగుతున్నా నీ మనసు చెలిస్తే నీకు ఇంకా వాసనలు ఉన్నట్టే. కాని చుట్టూ ఏం జరుగుతున్నా నువ్వు పట్టించుకోకుండా ఉండగలిగితే నీలో వాసనలు నశించినట్టే అని మహాత్ములు చెప్తు ఉంటారు.

వర్షం పడగానే గడ్డి మొలిచినట్టు సంఘటనలు చూసిన వెంటనే నీలో కోరికలు విజ్రంభిస్తున్నాయి అంటే నీలో ఇంకా వాసనలు తగ్గలేదు అని లెఖ్ఖ, వాసనలే నిన్ను క్రిందకు లాగుతున్నాయి అని తెలుసుకోవాలి.

మోక్షం కావాలి అంటే సాధన మీద, గురువు మీద విశ్వాసం ఉంటే నువ్వు మోక్ష స్థితిని తొందరగా పొందగలవు. నువ్వు చేస్తున్న సాధన మీదే నీకు విశ్వాసం లేకపోతే, గురువుని విశ్వసించకపోతే నువ్వు విశ్వమంతా తిరిగినా వీసమెత్తు ఆత్మజ్ఞానం పొందలేవు, మోక్షం పొందలేవు.

అసలు భగవంతునకు ఉన్న పేరే "సచ్చిదానంద స్వరూపుడు". కాబట్టి సత్యం ఎక్కడ ఉందో అక్కడ భగవంతుడు ఉన్నట్టు, చైతన్యం ఎక్కడ ఉందో అక్కడ భగవంతుడు ఉన్నట్టు, ఆనందం ఎక్కడ ఉందో అక్కడే భగవంతుడు ఉన్నట్టు అని చెప్పడం జరిగింది.

ఇప్పుడు మీరు ఎన్ని తెలుసుకున్నా ఎన్ని వింటున్నా, ధ్యాన సాధనకి ఆకర్షించ లేకపోతున్నారు, జ్ఞానం పొందలేక పోతున్నారు. కారణం సూది అంటు రాయికి సూది అతుక్కోకపోతే లోపం సూదిదట. అలాగే గురువులు ఇంత చెప్తున్నా నీ తలకి ఎక్కట్లేదు అంటే గురువులో లోపం కాదు, నీలో లోపం. ప్రతి వాడికి తన సాధన తాను పొందుతున్న జ్ఞానం మీద అపారమైన విశ్వాసం, నమ్మకం ఉండాలి. అప్పుడు మానవుడు ఈ జన్మ చివరి జన్మ చేసుకోగలిగినంత గొప్ప స్థితికి ఎదుగుతాడు.

మీరందరు ప్రతి రోజు తెల్లవారు జామున లేవడం, జూమ్ లో ధ్యానం చేయడం, జ్ఞానం పొందడం ఇంచుమించుగా 6 సంవత్సరాల నుంచి చేస్తున్నారు.

కొంతమంది అజ్ఞానులు ఏమంటారంటే? ఎంతసేపూ ఆత్మ, ఆత్మ అంటారు, చెప్పిందే చెప్తారు అంటారు. కాని మీరంతా ఆత్మ స్వరూపులు, మీరు మాట్లాడుకోవాల్సింది ఆత్మజ్ఞానం గురించి, కారణం మీ ఇంద్రియాలకు శక్తిని ఇచ్చేదే ఆత్మ అంటే భగవంతుడు. అటువంటి ఆత్మ గురించి అవగాహన చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అంటే ఇది అర్థం చేసుకునే స్థాయిలో లేనంత అజ్ఞాన స్థితిలో ఉన్నారని అర్థం చేసుకోవచ్చు.

ఎందుకు అలా అనుకుంటారు అంటే సహజంగా వారికి ప్రాపంచిక భోగాలు అనుభవించాలనే కోరికే దానికి కారణం. వారేమంటారంటే? అసలు మనం ధ్యానం చేస్తున్నదే అనుభవించడానికి అని అంటారు.

చూడండి చాలా మందికి సుఖ, సంతోషాలు కావాలి, రోగాలు వద్దు, దుఃఖాలు వద్దు అనుకుంటారు. రోగం వచ్చినా, కష్టాలు వచ్చినా మనసుకు బాధ, అంటే ఇవన్నీ మనసుకున్న కోరికలు. కాని వాటన్నిటికీ ఉన్న ఒకే ఒక్క మందు ధ్యానం వల్ల పొందే ఆత్మజ్ఞానం అని వారికి తెలియదు.

మానవ జీవితంలో దుఃఖం నుంచి బయట పడాలి అంటే ఉన్న ఒకే ఒక్క మార్గం ధ్యానము. బాహ్య రోగాలకి ఎన్నైనా మందులు ఉన్నాయి, కాని ప్రపంచంలో భవ రోగానికి మందు ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చాకే దొరుకుతుంది.

ఈ భూమి మీదకి ధ్యానం చేయలని వచ్చిన మానవుడు, ధ్యానాన్ని మర్చిపోవడమే పెద్ద తప్పు. పోనీ ఒకవేళ గురువు దొరికినా ఆ గురువు మాటల్ని వినలేక పోతున్నారు అంటే వారి సంస్కారం వెనక్కి లాగుతుందని అర్థం చేసుకోవాలి.

అందుకే "ముక్తోపనిషత్తులో" శ్రీరామచంద్రుడు చెప్తాడు. దేహవాసన, లోక వాసన, శాస్త్రవాసన ఈ మూడు వాసనలు తీవ్రంగా ఉన్నప్పుడు గురువు ఎంత బోధించినా ధ్యానం తలకి ఎక్కదు, అందుచేత ఈ మూడు వాసనలు

వదులుకో అన్నారు.

దేహాన్ని సుఖ పెట్టాలి, దేహానికి అన్ని కావాలి అనుకోవడమే దేహవాసన. లోకంలో అందరూ గొప్పగా ఉండాలి, లోకం మంచి కోరుకోవడం అన్నది లోకవాసన. అలాగే శాస్త్రాలు, పురాణాలు అనుసరించడం, ఆ రకమైన భక్తిలో ఉండిపోవడం శాస్త్రవాసన. ఈ మూడు వాసనలు వదిలించుకుంటేనే మీ మనసు సాధన మీదకి వెళుతుంది. మీరంతా ఆ మూడు వాసనలు వదులుచుకున్నారు కాబట్టే ధ్యానం చేయడం, జ్ఞానం వినడం చేస్తున్నారు.

ఒక్కటేనండి మీకు కష్టాలు, బాధలు, రోగాలు ఉన్నాయి అంటే ఇంకా పాప కర్మలు ఉన్నట్టే. మీకు ఆత్మ దర్శనం కలగలేదంటే మీలో ఇంకా కర్మలు ఉన్నాయని లెక్క. దానికి జ్ఞానం పెంచుకుంటూ కర్మలు లేకుండా చేసుకోవాలి.

కర్మలు తొందరగా పోవాలి అంటే ఎక్కువ సాధన చేయాలి, ఎక్కువ జ్ఞానం పెంచుకోవాలి, దానితోపాటు యజ్ఞమయ కర్మలు చేయాలి. "యజ్ఞవంతమైన జీవితం" జీవించాలి, అంటే లోక కళ్యాణం కోసం చేసే ప్రతి సత్కర్మ యజ్ఞమే.

మరి మానవుడిగా భూమి మీదకు వచ్చినా మానవుడిగా పిలవ బడట్లేదు అంటే ద్విపాద పశువుల్లా బ్రతుకుతున్నారు. అంటే జంతువులు వేటికి ప్రాముఖ్యం ఇస్తున్నాయో వాటికే ప్రాముఖ్యం ఇస్తూన్నారు. కానీ మానవుడు ఎప్పుడు మానవుడిగా గుర్తింపబడతాడు అంటే? మానవుడు భూమిమీద ధ్యానసాధన చేసి, ఆ సాధన వల్ల మరుజన్మ లేకుండా చేసుకున్నప్పుడు.

మరి మానవుడు ధన్యుడు ఎట్లా అవుతాడు అంటే కబీర్ ఏమన్నారంటే? అందరూ ధ్యాన సాధన చేసి ఆత్మ సాక్షాత్కారం పొందే ప్రయత్నం చెయ్యాలి.

కబీర్ 3 పాయింట్లు చెప్పారు

1. ప్రతి వాడి శరీరంలో ఆత్మగా పరమాత్మే ఉన్నాడు.

2. మరి ఆయన కోసం ప్రయత్నించడమే ధన్య జీవితం

3. ఆ పరమాత్మ ప్రకటితమైతే అంటే దర్శనం కలిగితే వాడు ధన్యుడు అన్నాడు.

ఇప్పుడు మీరు శరీరంలో ఉన్న ఆత్మ కోసమే రోజు ధ్యానం చేస్తున్నారు, ప్రయత్నిస్తున్నారు. ధన్యజీవితం అంటే ఇదే. అలా జీవిస్తూ ఆత్మ కోసం ప్రయత్నిస్తే! చివరకు ఆత్మ దర్శనం పొంది ధన్యుడిగా ఎదుగుతారు అని కబీర్ చెప్పడం జరిగింది.

ఇలాంటి మానవ జీవిత సార్థకత ధ్యాన సాధనలోనే ఉంది. మరి మానవుడిగా పుట్టినవారు మానవుడిగా ప్రవర్తించాలి అంటే తీవ్రసాధన చేసి జ్ఞానం పొందాలి.

అది పొందినప్పుడు కర్మలు దగ్ధమై మీ శరీరంలో ఉన్న ఆత్మ ప్రకటితం అవుతుంది అంటే ఆత్మ దర్శనం కలుగుతుంది. మరి అలాంటి జీవితం కోసమే మానవుడిగా భూమి మీదకి వచ్చారు, సద్గురువు వల్ల సాధన తెలుసుకున్నారు, ఈ జన్మనే చివరి జన్మ చేసుకునే మార్గం కూడా తెలుసుకున్నారు.

మరి అలాంటి జీవితం జీవిస్తున్న మీ అందరి జీవితాలు ధన్యమైన జీవితాలే. మరి ఇదంతా అర్థం చేసుకుంటే మీ ప్రయత్నం తీవ్రంగా ఉంటుంది. మీ సాధన మీరు చేసుకుంటూ, ఎవరికైతే విశ్వంలో ఈ సాధన అవసరం ఉందో వాళ్ళకి చెప్పడం పరమ ధర్మం. మీకు మీరు ఆనంద పడటం ధర్మం, ఎదుటివాడికి ఆనందం కలిగించడం పరమ ధర్మం .

మరి రాఘవరావు గారి శిష్యులందరూ కూడా పరమ ధర్మంలోనే ఉన్నారు. వారు ధ్యానం చేయడమే కాదు, అందరూ దుఃఖాల నుంచి, బాధల నుంచి, బయట పడాలి అని ప్రయత్నం చేస్తున్నారు. దానికోసమే సాధన,

దానికోసమే ఈ జ్ఞానం అని అందరూ తెలుసుకున్నారు.

కాబట్టి మీరు జ్ఞానం పెంచుకుంటేనే ఇంకొకరికి చెప్పగలరు. అందుచేత ఈ సత్యాన్ని అర్థం చేసుకుని ఆచరణలో పెట్టుకున్నప్పుడు, అంటే ఆత్మగా జీవించి నప్పుడు, అంటే నేను ఆత్మ అన్నట్టుగా ఏ పని చేసినా మీరు ఆత్మ స్థితిలో ఉన్నట్టే.

శంకరాచార్యుల వారు మోక్షం పొందాలి అన్న కోరిక కూడా ప్రక్కన పెట్టమన్నారు, నీ కర్తవ్యం నువ్వు చేస్తూ వెడితే ఆయన నీకు ఎప్పుడు ఇవ్వాలో అప్పుడు ఇస్తారు అన్నారు. అందుచేత మనమంతా ఆ రకంగా జీవిద్దాం జీవితాన్ని ధన్యం చేసుకుందాం.




బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే
**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

*నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

*ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం*

రిజిస్ట్రేషన్ కొరకు : **సింధూర, సెల్: 8555995217**

# ప్రాపంచిక విద్య- ఆధ్యాత్మిక విద్య

ఈ మార్గంలోకి వచ్చిన మీరు అజ్ఞానాన్ని పోగొట్టుకొని, జ్ఞానం వైపు వెళ్ళడానికే సజ్జన సాంగత్యాలు చేస్తున్నారు. ప్రతి మానవుడికి ప్రాపంచిక జీవితంలో కానీ, ఆధ్యాత్మిక జీవితంలో కానీ విద్య అన్నది చాలా అవసరం. అందుకే "విద్య లేని వాడిని వింత పశువు" అని పెద్దలు చెప్తూ ఉంటారు.

ఈ పశు లక్షణాలు వదలాలి అంటే మానవుడికి విద్య చాలా అవసరం. జన్మ తీసుకున్న దగ్గర నుంచి ప్రాపంచిక విద్య నేర్చుకుంటారు, తర్వాత ఆధ్యాత్మిక విద్య లోకి వస్తారు. ప్రాపంచిక విద్య వున్న వాడికి అన్నింటిని అవగాహన చేసుకునే శక్తి ఉంటుంది. అలాగే ఆధ్యాత్మిక విద్య అవగాహన ఉంటే సృష్టి గురించి అర్థం ఆవుతూ ఉంటుంది.

ప్రాపంచిక ధనం దానం చేస్తే తరిగి పోవచ్చు, కానీ ఆధ్యాత్మిక విద్య దానం చేసే కొద్ది పెరుగుతూ ఉంటుంది. ఇతరులకి ఎంతగా ఇస్తారో మీరు అంతగా వృద్ధి అవుతారు. ఏ విద్య అయినా ఇతరులకు చెప్పకపోతే అది అభివృద్ధి కాదు. మీరు చెప్తున్న కొద్దీ ఇంకా ఇంకా కొత్త విషయాలు తెలుసుకుంటూ మీ జ్ఞానాన్ని ఇంకా పెంచుకుంటూ ఉంటారు. అందుకే ఎప్పుడూ విద్య అన్నది దాచుకోకూడదు అని మహాత్ములు బోధిస్తూ ఉంటారు. దానం చేసినా తరగనిది, దొంగల చేతికి దొరకనిది.. విద్య అంటారు. అంటే ఎంతగా దానం చేస్తారో అంతగా వృద్ధి అవుతారు. అంతేకాదు మీ మనసు శుద్ధిగా ఉంటే మీరు చెప్పేది ఎదుటి వారిలో మంచి పరివర్తన తీసుకొస్తూ ఉంటుంది.

మరి ప్రాపంచిక విద్య నేర్చుకున్న వాళ్ళకి కొద్దిగా అహంకారం పెరగొచ్చు, వారు డబ్బు ఇస్తేనే ట్యూషన్స్ చెప్తారు, ఉద్యోగాలు చేస్తారు. ఇవన్నీ డబ్బుతో ముడి పెట్టుకుంటారు, డబ్బు లేనిది ఏది ఖర్చు పెట్టుకోరు. కానీ ఆధ్యాత్మిక విద్య నేర్చుకున్నవాడు అందరికీ ఉచితంగానే ఇవ్వాలి

అనుకుంటాడు. పత్రి గారు ఈ విద్య నేర్పుతున్నప్పుడు డబ్బు తీసుకోకూడదు అని అందరికి నేర్పడం జరిగింది. సరస్వతీ దేవిని ఎప్పుడూ డబ్బుకి అమ్మ కూడదు అని గురువులు చెప్తూ ఉంటారు.

పూర్వం రోజుల్లో కొంతమంది అప్పటి రాజులకి వాళ్ళ కవిత్వాన్ని అంకితం ఇచ్చి ఎంతో ధనం తీసుకునేవారు. కానీ పోతన లాంటి మహాత్ములు రాజులకు అంకితం ఇవ్వకుండా ప్రజలకి ఆ భాగవతం అంకితం చేశారు.

అందుకే విద్య ఎప్పుడూ ఉచితంగా చెప్పగలిగిన రోజున ఇంకా ఇంకా రాణిస్తూ ఉంటుంది. కానీ నేటి పరిస్థితుల్లో భుక్తి కావాలంటే మరి అమ్ముకోక తప్పట్లేదు. కానీ ఆధ్యాత్మిక విద్య అంటే పరావిద్య అంటే పరమాత్మ గురించి తెలిపే విద్య, పరలోకాలను గురించి తెలిపే విద్య ధనానికి అమ్మకూడదు. ఆ విద్య నేర్చుకున్న మనిషి పరిపూర్ణుడు అవుతాడు. అందుకే ఈ విద్య చెప్పేటప్పుడు డబ్బు ఆశించకూడదు అంటారు. అలా ఆశించిన వారికి ప్రకృతి సహకారం లభించదు.

చూడండి ఉచితంగా చెప్తున్న కొద్ది మీరు ఇంకా ఇంకా ఎదుగుతూ ఉంటారు. అందుకే గురువులు ఎప్పుడూ కూడా డబ్బులు తీసుకోకుండానే ఉచితంగా శిష్యులకి బోధించేవారు. **"మరి జన్మని ఇచ్చిన తండ్రి కంటే జ్ఞానం ఇచ్చిన గురువు గొప్పవాడు అంటారు".** ఎందుకు అంటే తల్లిదండ్రులు ఈ శరీరం ఇవ్వచ్చు, సంపదలు ఇవ్వచ్చు, అవన్నీ ఈ జన్మకే పరిమిత మవుతాయి కానీ మరు జన్మకి ఉపయోగపడవు. కానీ గురువు ఇచ్చే జ్ఞానాన్ని ఇస్తే అది ఈ జన్మకే కాదు మరుజన్మకు కూడా ఉపయోగపడుతుంది.

ఒక్క ప్రాపంచిక విద్య నేర్చుకుంటే మీరు ఈగలా బ్రతుకుతారు. ఈగ కుళ్ళిన వాటి మీద, మంచి వాటి మీద వ్రాలుతుంది కానీ ఎవరికీ ఉపయోగపడదు. కానీ ప్రాపంచిక విద్యతో పాటు ఆధ్యాత్మిక విద్యను నేర్చుకున్న వారు తేనె టీగలాగ ప్రవర్తిస్తారు. అంటే అన్ని పువ్వులలో మకరందం తీసుకుని

తేనెని తయారు చేసి తిరిగి మీకే ఇస్తుంది తేనటీగ.

మీరు కూడా ప్రాపంచిక విద్యతో పాటు ఆధ్యాత్మిక విద్య నేర్చుకున్నప్పుడు గురువు చెప్పింది వినడమే కాదు, స్వాధ్యాయం ద్వారా మీరు ఎందరో మహర్షులు, మహాత్ములు, చెప్పిన విషయాలను సేకరించి మీరు విజ్ఞానంతో దాన్ని పెంచుకుంటూ, వివేకంతో దానిలో సూక్ష్మాతి, సూక్ష్మమైన విషయాలను గ్రహిస్తూ ఇంకా ఇంకా ఎదగాలి అని చెప్తారు. మీ ప్రాపంచిక విద్య ధనసంపాదనకి పనికివస్తుంది.

మరి ఆధ్యాత్మిక విద్యలో  నేర్చుకోవడమే కాదు, సాధన కూడా ఉంటుంది కాబట్టి సూక్ష్మాతి సూక్ష్మమైన విషయాలను కూడా అర్థం చేసుకోగలిగే అంతటి మేదస్సు మీకు వస్తుంది. మరి గ్రహణ శక్తి పెరుగుతుంది, జ్ఞాన శక్తి పెరుగుతుంది, సాధన వల్ల మేధాశక్తి పెరుగుతుంది .

అందుకే ప్రతి వాళ్ళకి ప్రాపంచిక విద్య, ఆధ్యాత్మిక విద్య రెండింటి అవసరం ఉంది. ఈ రెండిటి వల్లే మనిషి పరిపూర్ణత్వం పొందగలడు.

ఈ భూమి మీద ఉండగానే తాను ఎవరు? తాను ఎక్కడి నుంచి వచ్చాడు? ఎక్కడికి వెళ్ళాలి ?వెళ్ళడానికి ఏం చేయాలి? ఇలాంటి విషయాలన్నీ కూడా మీ జీవితంలోకి సద్గురు వచ్చినప్పుడే తెలుస్తాయి అని అధ్యయనం చేసినప్పుడే లోతుల్లోకి వెళ్ళ గలుగుతారు.

ఇప్పుడు రాఘవరావు సార్ చూడండి మరణం గురించి ఎన్నో పుస్తకాలు వ్రాశారు. అవి చదివాక ఎవరికీ మరణం భయం వుండదు. వారు మరణానంతరం ఏం జరుగుతుందో తెలుసుకుంటూ, నేను మరణించేలోగా ఎంత విద్య నేర్చుకోవాలో అంతా నేర్చుకుంటారు, ఈ భూమ్మీద నుంచి నేను పట్టుకెళ్ళే సంపద ఈ పరావిద్యే అని తెలుసుకున్నప్పుడు ఈ విద్య మీద ఆసక్తి చూపిస్తారు.

గమనిస్తే ప్రాపంచిక విద్య ఒక్కటే నేర్చుకుంటే సుఖాల మీద, భోగాల

మీద, బంధాల మీద, డబ్బు మీద, పదవుల మీద అన్నిటి మీద ఆసక్తి ఉంటుంది. దానితో పాటు ఆధ్యాత్మిక విద్య నేర్చుకున్నప్పుడు దేని మీద ఆసక్తి ఉండదు.

ఎంతసేపు మీరు పరమాత్మకు ఇష్టులుగా అవ్వాలంటారు? ఒకవేళ మీ పూర్వజన్మ పుణ్య కర్మ వల్ల డబ్బు వచ్చినా! పదవి వచ్చినా! అందరూ ప్రేమించినా దేనికి చెలించకుండా స్వీకరిస్తారే కానీ దేనిని ద్వేషించరు. అందుకే పత్రిగారు **"వస్తే రాని ఉంటే ఉండని పోతే పోని"** అనేవారు. అప్పుడు నువ్వు దేనికి చెలించని మనస్తత్వాన్ని అలవరచు కుంటావు.

మీకు ఈ స్థితి ఎలా వస్తుంది అంటే సాధన వల్ల. మీ మనసు నిశ్చలమైనప్పుడు రావలసినవి వస్తాయి. నా పూర్వజన్మ కర్మల్లో పుణ్యం ఉంటే వస్తుంది, లేదా నేను జన్మ తీసుకున్నప్పుడు నా ప్రణాళికలో ఇది ఒక భాగమైతే తప్పకుండా నాకు వస్తుంది అని అర్థం చేసుకుంటారు. కానీ అహంకారాన్ని పెంచుకోరు.

అందుకే ప్రాపంచిక విద్య ఒక్కటే నేర్చుకుంటే అహంకారం పెరుగుతూ ఉంటుంది. ప్రాపంచిక విద్యతో పాటు ఆధ్యాత్మిక విద్య నేర్చుకున్నప్పుడు ఏ అహంకారము పెరగదు. ఎందుకు పెరగదంటే? ఈ సృష్టి అంతా పరమాత్మదే నాది ఏమి కాదు, నా పూర్వ జన్మ పుణ్యం వల్ల మాత్రమే నేను ఇక్కడ ఈ భోగాన్ని అనుభవించడానికి హక్కు కలిగింది. కానీ ఇప్పుడు నేనేమి సంపాదించట్లేదు, ఇది పుణ్యం వల్ల వచ్చింది, కాబట్టి ఏదీ నాది కాదు, నేను వెళ్లేటప్పుడు ఏది పట్టు కెళ్ళలేను. అని అర్థం చేసుకని భగవంతుడికి, ప్రకృతికి, వినమ్రుడిగా ఉంటూ, సత్యం చెప్పిన గురువుకి కూడా వినమ్రంగా ఉంటూ ఈ విద్య నేర్చుకోవడానికి ప్రయత్నిస్తారు.

ప్రాపంచిక విద్యలో సుఖము, సంతోషము ఉంటుంది, ఆధ్యాత్మిక విద్యలో ఆనందం ఉంటుంది. ఆ ఆనందం కోసమే మహాత్ములు, ఋషులు అన్ని వదిలి ఈ ఆధ్యాత్మిక విద్యను నేర్చుకోవడానికి ప్రయత్నించేవారు.

అందుకే మీరు ప్రాపంచిక విద్య, ఆధ్యాత్మిక విద్య రెండు నేర్చుకున్నప్పుడు వివేకము, వైరాగ్యము, విచారణ ఈ మూడు వస్తాయి.

వివేకం అంటే నిత్య, అనిత్య వస్తు వివేకం అంటే ఏది నిత్య మైంది, ఏది అనిత్యమైంది అని తెలుసుకునే వివేకం.

వైరాగ్యం అంటే ఇవన్నీ నేను వదిలిపోయే వీటి మీద నేను మమకారం పెంచుకోకూడదు. అందుచేత ఉన్నప్పుడు అనుభవించాలి, కానీ ఇదేదో దాచేయాలి అని ఎప్పుడు అనుకోకూడదు. ఇది ఎవరు పుణ్యం చేసుకుంటే వాళ్ళకి అనుభవించే హక్కు ఉంటుంది కాబట్టి నాది అనే మమకారాన్ని పెంచుకో కూడదు. వైరాగ్యంతో ఉంటూ అంటే ఏనాటికైనా నేను వదిలి వెళ్ళాలి అని గుర్తు ఉండాలి.

అంతేకాదు గురువు చెప్పిన విషయాల పట్ల, చదివిన విషయాల పట్ల, ఎప్పుడు విచారణ చేసుకుంటూ ఉండాలి. మొదట గురువు నువ్వు ఆత్మ అంటాడు, అప్పుడు అందరూ ఒక్కసారి ఉలిక్కి పడతారు. ఏమిటి? శరీరం కనబడుతుంటే ఆత్మ అంటాడు అనుకుంటారు.

అలా ఆత్మ అనగానే మరల వెంటనే చెప్తాడు "ఆత్మే భగవంతుడు" అని. నువ్వు భగవంతుడివే కానీ వేరే ఏమి కాదు. ఈ శరీరము, మనసు వల్ల నువ్వు జీవుడవి అనుకుంటున్నావు. అవి రెండు ఇక్కడే వదిలి నువ్వు ఆత్మగా పైలోకానికి వెళ్ళినప్పుడు నువ్వు ఎక్కడ ఉంటావో తెలుసుకో! విచారణ చేసుకో! ఇవన్నీ విచారణ చేసినప్పుడు నిజమే కదా? అని తెలుస్తుంది.

ఈ ఆత్మ తల్లి గర్భంలో ప్రవేశించి శరీరం అనే తొడుగు తొడుక్కుని భూమిమీదకు వచ్చి పరిస్థితుల వల్ల, తల్లిదండ్రుల వల్ల, ఒక సంకుచితమైన మనసు ఏర్పరచుకుని నేను జీవుడ్ని అనుకుంటారు. జీవుడ్ని అనుకుంటే అన్నిటికీ బంది అయి బానిసలా బ్రతుకుతారు. అరిషడ్ వర్గాల్లో, అహంకార మమకారాల్లో, రాగద్వేషాల్లో బంది అయి బానిసగా బ్రతుకుతున్నారు.

అయితే ఇక్కడ గొప్ప కోసం, పేరు ప్రతిష్టల కోసం చదువుతారు. ఈ చదువు వల్ల అహంకారం పెంచుకుంటూ ఉంటారు. ఏ జన్మలో పుణ్యం చేసి వచ్చారో జీవితంలో సద్గురువు లభిస్తాడు. అప్పుడు ఎన్ని చదువులు ఉన్నా, ఎన్ని పదవులు ఉన్నా, ఎన్ని సంపదలు ఉన్నా ఆధ్యాత్మిక విద్య లేని జీవితం పరిపూర్ణత్వం కాదు అని తెలుసుకుంటారు. మానవుని పరలోకానికి తీసుకువెళ్లే విద్య ఆధ్యాత్మిక విద్య.

ప్రాపంచిక విద్య ఈ శరీరం కాలి పోయినప్పుడు నశించి పోతుంది. కానీ ఆత్మ పైలోకాలకి వెళ్ళినప్పుడు ఈ పరావిద్యనే పట్టుకొని వెళ్తుంది. అన్న సత్యం గురువువల్ల తెలుసుకున్నప్పుడు, ఇది నేర్చుకోవడానికే భూమి మీదకు వచ్చావని తెలుస్తుంది.

ఈ ఆధ్యాత్మిక విద్య అధ్యయనం చేయాలి అంటే ప్రాపంచిక విద్య కావాలి అని చదువుకున్నారు. అది కూడా మీ ప్రణాళికలో ఒక భాగమే. మరి అది చదువుకున్నాక మళ్ళా ఇందులోకి వచ్చినప్పుడు వీటికి సహకారిగా ఉపయోగపడు తుంది ప్రాపంచిక విద్య అని తెలుస్తుంది.

చదివే అక్షరాలే రాకపోతే మహా గ్రంథాలు చదవలేరు కాబట్టి అవి కూడా నేర్చుకోవాలి. కానీ పైలోకాలకి వెళ్ళేటప్పుడు ఈ పరావిద్యే పనికి వస్తుంది, కూడా తీసుకువెళ్తాము అనే విషయం ఇక్కడికి వచ్చాక తెలుస్తుంది. అందుకే ప్రాపంచిక విద్య ఒక్కటే చదివితే అహంకారం పెరుగుతుంది.

మరి ప్రాపంచిక విద్య చదివితే నేను ఈ పని చేయలేను, ఆ పని చేయలేను అని అసమర్థత ప్రకటిస్తావు. నావల్ల కాదు, నాకు తెలియదు అన్నది అసమర్థత. ఎందుకంటే ప్రాపంచిక విద్య మనసు ప్రభావంతో ఉంటుంది, అందుకే ఎంత చదువుకున్నా అసమర్థుల్లా మిగిలిపోతారు.

ప్రాపంచిక విద్యతో పాటు ఆధ్యాత్మిక విద్యని ఎప్పుడైతే అధ్యయనం చేస్తారో అప్పుడు అసమర్థత ఉండదు, సమర్థత వస్తుంది, ఏదైనా సరే

ప్రయత్నిస్తారు.

ఎప్పుడైతే ఈ ఆధ్యాత్మిక విద్య ఎంతగా అధ్యయనం చేస్తారో, ఎంతగా ప్రయత్నిస్తారో అప్పుడు మీకు పరోపకార బుద్ధి వస్తుంది. ఎందుకంటే అందరూ ఆత్మ స్వరూపులే! అందరూ మానవ జన్మ తీసుకుని భూమి మీదకు వచ్చినవారే! మానవులకు తాను ఎవరో తెలుసుకోవడానికి, మోక్షం పొందటానికి అర్హత ఉంటుంది.

అందరూ ఆత్మలమే అని అర్థమైనప్పుడు ప్రాపంచిక విద్యలో అన్న, చెల్లెలకి సహాయం చేసినట్టు, ఆధ్యాత్మిక విద్యలో తోటి వారికి సహాయం చేయడానికి ఉత్సాహం చూపిస్తారు.

చూడండి మీకు పత్రిగారు ఆధ్యాత్మిక విద్యతో పాటు ధ్యాన ప్రచారం కూడా చేయమని చెప్పారు. ఎందుకు అంటే నువ్వు ఆనందం పొందడమే కాదు, తోటివారు కూడా ఆనందంగా ఉండాలి, అంటే ఈ సాధన, ఈ జ్ఞానం వాళ్ళకు తెలిసినప్పుడే దుఃఖం నుంచి బయట పడతారు కాబట్టి.

మరి ప్రాపంచిక చదువులు చదివిన వాళ్ళు మాంసం మానమంటే మానరు. ఇవి మనకోసమే పుట్టాయి, హెల్దీ ఫుడ్, టేస్టీ ఫుడ్ అనుకుంటూ తింటారు. కానీ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చాక అన్ని జీవులు పరమాత్మ నుంచే ఉద్భవించాయి. పరిణామ క్రమంలో ఈ రకంగా జన్మలు తీసుకుంటాయి కానీ అవి కూడా పాఠాలు నేర్చుకోవడం అయిపోయాక చిట్ట చివరి జన్మలో మానవ జన్మ తీసుకుని మోక్షం కోసం ప్రయత్నిస్తుంది అని తెలుస్తుంది.

ఈ పరమ సత్యాన్ని గురువు దగ్గర నేర్చుకున్నప్పుడు, మంసాహారం మానేస్తారు. కారణం ఆత్మలన్నీ పరమాత్మ నుంచి వచ్చాయి, పరిణామ క్రమంలో అవి ఏ పాఠం నేర్చుకోవడానికి వస్తాయో! ఆ పాఠాలు నేర్చుకుంటాయి. కానీ అవి ఆహారంగా బలి అవ్వడానికి పుట్టలేదు అనే సత్యం గురువు వచ్చాక తెలుస్తుంది.

మీరు జీవహింస చేస్తున్న పాపం వల్లే మీ జీవితంలో దుఃఖం వస్తుంది, బాధలు వస్తున్నాయి, రోగాలు వస్తున్నాయి అనే సత్యాన్ని తెలుసుకున్నప్పుడు ఆ పాపం చేయడం ఆపేస్తారు. అందుకే "ప్రతి వ్యక్తి ప్రాపంచిక విద్య, ఆధ్యాత్మిక విద్య తెలుసుకున్నప్పుడే మనిషి జీవన విధానం ఎలా ఉండాలో అలా ఉంటుంది".

కానీ మనిషి మనిషిలా జీవించి మహాత్ముడిగా ఎదుగుతూ, మాధవుడిగా ఎదుగుతూ, ప్రజల్లో తానే దేవుడిగా మెసులుతూ ఉంటాడు. ఎప్పుడైతే మీరు ధ్యానము చేస్తూ, జ్ఞాన ప్రచారం చేస్తూ ఉంటారో, అందరికీ చెప్తూ ఉంటారో మీ జీవితం ఉద్దరింప బడుతుంది.

మహాత్ములు ఒక మాట చెప్తారు, లోకాన్ని ఉద్ధరించే కార్యక్రమంలో నువ్వు ఉన్నప్పుడు, నీ జీవితం భగవంతుడు చేత ఎప్పుడూ ఉద్ధరింపబడుతుంది అని చెప్తారు. నువ్వు నీ శక్తిని, నీ జ్ఞానాన్ని, నీ ధనాన్ని లోక క్షేమం కోసం, లోక కళ్యాణం కోసం ఇస్తున్నప్పుడు, నీ కళ్యాణం భగవంతుడు చూసుకుంటాడు.

అందుకే వివేకానందుడు ఒక మాట చెప్తూ ఉంటాడు. "నీ క్రింది వాళ్ళ కన్నీళ్ళు నువ్వు తుడవగలిగినప్పుడు, నీ పైవాడు నీ కన్నీళ్లు తుడవడానికి ఎప్పుడు రెడీగా ఉంటాడు". అంటే ఏడుపు ఆపడం కాదు మీ దుఃఖాలు తొలగించుకుకునే శక్తి మీకు వస్తుంది.

మీరు ఎంత ఎదుగుతున్నా దుఃఖకరమైన సంఘటనలు మీ చుట్టూ జరుగుతూ ఉంటాయి. కానీ వాటిని తట్టుకుని, ఓర్చుకుని ఎదగగలిగే శక్తి ఆధ్యాత్మిక విద్య వల్ల మాత్రమే వస్తుంది. మీకు ఎంతటి దుఃఖాన్నైనా భూదేవిలా భరించే శక్తి ప్రకృతి ద్వారా అందుతూనే ఉంటుంది.

అందుకే ప్రాపంచిక విద్య నేర్చుకుంటే 1/4 జ్ఞానం వస్తుంది. ఎప్పుడైతే ఆత్మ విద్య నేర్చుకుంటారో! ఈ పరా విద్యను అధ్యయనం చేస్తారో! అప్పుడు మీకు 100 కి 100 పరిపూర్ణంగా ఎదగగలిగే శక్తి వస్తుంది. సాధన

చేసేవాడు విశ్వానికి ఎప్పుడు ఉపయోగ పడతాడు. సాధనతో పాటు పరావిద్యా నేర్చుకున్నవాడు ఈ విశ్వానికి అంతటికీ ఇవ్వడానికే చూస్తాడు.

ఒక్క ప్రాపంచిక విద్య నేర్చుకుంటే దాని ద్వారా నేను ఎంత డబ్బు సంపాదిస్తాను, ఎన్ని పదవులు వస్తాయి, అని తనకి, తన కుటుంబానికే పరిమితమై అహంకారాన్ని పెంచుకుంటాడు. అందుకే అన్నారు "అహంకారి ఈగ లాంటి వాడు, సాధకుడు తేన టీగ లాంటి వాడు". ఈగ అన్నిటి మీద వాలి ఎవరికీ ఉపయోగపడదు, తేనటీగ అందరికీ ఉపయోగ పడుతుంది .

అందుకే మీరు కూడా ఒక విద్య ఉంటే ఇంకొక విద్య వద్దని ఎప్పుడూ అనుకోకండి. ఎందుకంటే పిల్లలకి ప్రాపంచిక విద్య రావాలి, ఆధ్యాత్మిక విద్య తెలుసుకోవాలి. మరి భారతదేశంలో ఈ విద్య పుట్టింది, ఇక్కడున్న మీరైనా అధ్యయనం చేయకపోతే ఈ విద్య అంతరించి పోతుంది.

స్వామి వివేకానంద ఒక మాట అనేవారు, 'రత్నగర్భ అయిన నా దేశం ఈరోజు అప్పులు పాలయింది అంటే ఆధ్యాత్మిక విద్య లోపించడమే'. ఏనాడైతే నా భారతదేశంలో ఆధ్యాత్మిక విద్య వెలుగు పొందుతుందో అప్పుడు మళ్ళా నా దేశం రత్నగర్భ అవుతుంది. అని ఎంత నమ్మకంగా పలికాడో వివేకానందుడు చూడండి.

నిజమే ఒకప్పుడు కృత యుగంలో చూసుకుంటే అందరూ ధ్యానం చేసేవారు, జీవుడు దేవుడు ప్రక్క ప్రక్కనే ఉండి కావలసి నప్పుడల్లా దర్శనం చేయగలిగేవారట. త్రేతా యుగం వచ్చేటప్పటికీ రాజుల పరిపాలన వచ్చి మరి ఒకింత ఈ విద్య తప్పిపోయింది. మరి రాజులకు మాత్రమే ఈ విద్య ఎందుకు అంటే త్రేతాయుగంలో "చాతుర్వర్ణం మయా సృష్టం గుణ కర్మ విభాగశః" అన్నారు.

నాలుగు వర్ణాలుగా విభజించి ఒక్కొక్కడు ఒక్కొక్క పని చేయాలి అని నిర్దేశించబడి అది బ్రహ్మజ్ఞానం కొందరికే అన్నట్టుగా నియమించుకుంటే

మరి అలా ఒక్కొక్క యుగము వచ్చేసరికి తగ్గిపోయింది. ద్వాపర యుగం వచ్చేటప్పటికీ ఈ రాజ్యాలు ఏర్పడి, ఈ విద్య మీద ఆశక్తి పోయింది. చివరకు కలియుగంలో పూర్తిగా లేకుండా పోయింది.

మరి మీరంతా ఏ జన్మలో ఏ పుణ్యం చేసుకున్నారో పత్రిగారి లాంటి సద్గురువును పొంది అపరా విద్యతో పాటు పరావిద్య కూడా ప్రతి వాళ్ళకి అవసరము అని తెలుసుకొని మరి ఆ మార్గంలో పయనిస్తున్నారు.

ఇప్పుడు పత్రిగారి శిష్యుల్లో కూడా చాలామంది శరీరానికి, మనసుకి ప్రాముఖ్యం ఇస్తున్నారు. దానిని ప్రాపంచిక విద్య అంటారు. అపరా విద్య శరీరానికి, మనసుకి సుఖం సంతోషం ఇవచ్చు, కానీ పరావిద్య శరీరానికి మనసుకి కాదు, ఆత్మకు ఆనందం కలిగిస్తుంది.

ఈ పరావిద్య నేర్చుకునే వాడు ఎప్పుడు ఆత్మానందంలో ఉంటాడు. అంటే ఇహ లోకంలోనే కాదు, పరలోకం కూడా చేరగలిగే విద్య పరావిద్య. ఇది తెలుసుకుంటే అందరూ ప్రాపంచిక చదువులతో పాటు ఆధ్యాత్మిక చదువులు కూడా చదువుకుని నిత్యము ఆనంద స్థితిలో ఉంటారు.

ఇలాంటి వాళ్ళు లోక కళ్యాణకరమైన పనులు చేస్తూ లోకోద్ధరణ చేసి లోకంలో దైవంగా మిగలిపోతారు. ఎవరైతే లోకానికి ఉపయోగ పడతారో వాళ్ళనే "జీవన్ముక్తులు" అంటారు. అంటే జీవించి ఉండగా లోక కళ్యాణకరమైన పనులు చేస్తారు కాబట్టి.

అందుకే గురువులు పత్రీజీ రావడమే అదృష్టం, ఈ విద్యను అధ్యయనం చేయడం ఇంకా అదృష్టం. ఇది అధ్యయనం చేసి తెలుసుకుని ధ్యానాన్ని 10 మందికి పంచే అవకాశం రావడం, ఇంకా ఇంకా గొప్ప అదృష్టం. ఇది తెలుసుకుంటే అందరూ లోక కళ్యాణం కోసమే ప్రయత్నిస్తారు.

మన గురువుగారి ఆశయాన్ని ముందుకు తీసుకువెళ్ళే బాధ్యత ఆత్మవిద్య నేర్చుకున్న ప్రతి వాడికి ఉంటుంది.

# సత్యం అంటే ?

మీరు సత్య మార్గంలోకి వచ్చారు. సత్యం అంటే? ఎల్లప్పుడూ ఉండేది, శాశ్వతంగా ఉండేది, మార్పు చెందనిది, కాలం మారినా, యుగాలు మారినా మార్పు చెందనిది, అంటే ఒకప్పుడు ఉండి ఇంకొకప్పుడు లేకుండా ఉండదు.

కానీ పూర్ణంగా సత్యాన్ని ఎప్పుడూ దర్శించలేరు. సత్యాన్ని ఒకవైపు మాత్రమే దర్శించ గలుగుతున్నారు. అంటే భగవంతుడు సృష్టించిన సృష్టిలో అణువంత మాత్రమే మానవులు తెలుసుకోగలుగుతున్నారు.

కాని తెలుసుకోవలసింది అనంతంగా ఉంది. చాలామంది సత్య దర్శనం అయిపోయింది అనుకుంటారు. కానీ పూర్తిగా ఎవరికీ, ఎప్పుడూ సాధ్యం కాదు. పరమ శివుడికే ఇంకా అంతు పట్టలేదు, అందుకే ఆయన ఇంకా ధ్యానం చేస్తున్నాడు.

మరి ఈ సత్యం ఎందుకు తెలుసుకోవాలి? అంటే ప్రాపంచిక జీవితంలో వున్నవాడు ఈ మార్గంలోకి రానంతవరకు ప్రతీ మానవుడు నాది, నాది అనే స్వార్థంతోనే ఉంటాడు, కానీ ఇదంతా పరమాత్మది అనే ఎరుక ఎవరికీ లేదు, కారణం మాయ.

సత్యాన్ని తెలుసుకున్నాను అని ప్రతి వాళ్ళూ అనుకుంటారు. కాని ఎవరూ పూర్తిగా సత్యాన్ని తెలుసుకోలేరు, కానీ సాధనలో మాత్రమే నువ్వు తెలుసుకోగలవని చెప్పినా, ఇంకా చాలామంది వ్యవహారాల్లో మునిగి తేలుతూ ఉంటారు. లేకపోతే ఎంజాయ్ చేయాలని, చేయకపోతే జీవితమే వ్యర్థమని, ఇలాంటి అపోహల్లో చాలామంది బ్రతుకుతున్నారు.

ఎంతో కష్టపడి సాధన చేసినా కూడా ఋషులందరూ ఇంకా పూర్ణంగా తెలుసుకోలేదు. మీరు అప్పుడప్పుడు కళ్ళు మూస్తే ఈ సృష్టిని, సత్యాన్ని తెలుసుకోవడానికి ఇంకా ఎన్నో జన్మలు పడతుంది.

ఈ జన్మకి ఇంత వస్తే, వచ్చే జన్మకి ఇంకో ఇంత. అందుకే

మహాత్ములు నువ్వు సత్యాన్ని తెలుసుకోవాలి అంటే ఎంజాయ్ మెంట్ల మీద దృష్టి పెడితే తెలుసుకోలేవు అని చెప్తారు.

చూడండి ఈ రోజు ఒక హోటల్‌కి వెళ్ళి దోస తింటారు. దోస చాలా బాగుంది, హోటల్ వాడు చట్నీ ఎలా చేశాడో అని చట్నీని పొగిడి, దోసని పొగిడి దానిని మళ్ళీ ధ్యానంలోకి వచ్చేవరకు మననం చేస్తారు. అంటే సరదాగా ఒక్కసారి అనడం వల్ల 10 రోజుల ధ్యానం పోతుంది.

మీరు వాళ్ళ బలవంతం వల్ల , వీళ్ళ బలవంతం వల్ల బయటకు వెళ్ళామనుకుంటారు. కానీ ఎవ్వరి బలవంతం వల్ల వెళ్ళరు, మీ మనసు పీకుతేనే వెళ్తున్నారు. అంటే ఎవరైనా వచ్చి విషాన్ని ఇస్తే త్రాగుతారా? కోటి రూపాయలు ఇచ్చినా త్రాగరు.

ప్రాపంచిక జీవితంలో ఎంజాయ్ చేస్తే, ఆధ్యాత్మిక జీవితానికి అది విషం లాంటిదే.  కానీ మీ దృష్టి ఎప్పుడూ బాహ్యం మీద ఉండడం వల్ల, ఒక్కసారి చేస్తే తప్పేమిటి? అని, ఆ ఒక్కసారి చేసి 10 సార్లు ధ్యానం కుదరక ఇబ్బంది పడతారు.

అందుకే సత్యం వైపు నీ దృష్టి వెళ్ళినప్పుడు నువ్వు ప్రాపంచిక ఆకర్షణలు కొంత తగ్గించుకొని, ఆధ్యాత్మిక ఎదుగుదలకి ప్రయత్నం చేస్తావు.

ప్రపంచమంతా ఎవరికి వారు అన్నమయకోశం అంటే శరీరం వైపు చూసుకుంటూ ఉంటారు, ఈ అన్నమయ కోశాన్ని ఎంత బాగా పోషించాలి అని! అందరి దృష్టి అన్నమయ్య కోశం అంటే శరీరం మీదకే వస్తుంది, దేని మీదకి వెళ్ళదు.

మీరు అన్నమయ కోశం మీద ఎంతగా దృష్టి పెడుతున్నారో, అంతగా ఆత్మ మీద దృష్టి తగ్గిపోతుంది. నాకు సాంబార్‌లో ములక్కాడ ఇష్టం, గుమ్మడికాయ పులుసులో గుమ్మడికాయ ముక్క ఇష్టం. ఈ ఇష్టాలన్నీ అన్నమయ కోశానివే అంటే శరీరానివే. తిండికి సంబంధించినవి ఏదైనావుంటే నీ దృష్టి

ఇంకా ఈ కోశం అంటే శరీరం గురించే ఆలోచిస్తుంది కానీ, ఆత్మ గురించి ఆలోచించట్లేదు అని అర్థం. నువ్వు ఎంతగా ఆత్మ మీద, ఐదు కోశాల మీద దృష్టి పెడతావో, నీ దృష్టి ఆత్మ మీద నుంచి పోతుంది.

అసలు సాధన దేనికి చేస్తున్నారు?అన్నమయ కోశం కోసమా? ప్రాణమయ కోశం కోసమా? మనోమయ కోశం కోసమా? విజ్ఞానమయ కోశం కోసమా? ఆనందమయ కోశం కోసమా? అంటే సాధన ఈ ఐదు కోశాల గురించి కాదు, ఈ 5 కోశాల లోపల ఉన్న ఆత్మ అంటే భగవంతుడి కోసం.

చూడండి కొండపల్లి బొమ్మలు తీసుకుంటే ఒక రకం బొమ్మలో ఇంకొక బొమ్మ, ఆ బొమ్మలో ఇంకొక బొమ్మ ఇలా ఉంటాయి. చిన్నప్పుడు పిల్లలు ఆడుకునేవారు. ఆఖరులో బుజ్జి బొమ్మ ఉంటుంది, ఈ కోశాలు కూడా అంతే. ఒక దాంట్లో ఒకటి ఉండి మనిషిని భ్రాంతిలో పడేస్తూ ఉంటాయి.

ఈ కోశాల యొక్క భ్రమలో ఉన్నవాడు ఆత్మ గురించి అతి తక్కువ పని చేస్తాడు, అతి తక్కువగా శక్తిని సేకరించుకుంటాడు.

కొంతమంది విగ్రహమే దేవుడు అంటారు. గురువు వచ్చి ఆ విగ్రహాన్ని మీరే కదా తయారు చేసింది? అని అంటే? ఆలోచిస్తారు! ఇన్నాళ్ళు దానికే పూజలు చేసారు అంటే సృష్టి సృష్టిలాగే ఉంది, మీ దృష్టి బాగోలేదు. అందుకే మహాత్ములు సృష్టిలో ఏ లోపము లేదు, నీ దృష్టిలోనే లోపం ఉంది అంటారు.

గురువు వల్ల మానవ దేహం దేవుడు చేసిన మందిరం, అందులో ఉన్న ఆత్మే భగవంతుడు అని చెప్పినప్పుడు మీకు సత్యం అర్థమైంది. అప్పటివరకు అసత్యాన్ని సత్యం అనుకున్నారు. కారణం అప్పుడు బుద్ధి లేదు.

సహజంగా అంత వివరణ తల్లిదండ్రుల నుంచి నేర్చుకోలేదు, కారణం వాళ్ళకి తెలియదు. అందుచేత వాళ్ళు ఏం చెప్తే అది నమ్మేరు. దేవుడా! దేవుడా! అని అలమటించారు కాబట్టే దేవుడు ఎవరో చెప్పడానికి గురువు

వచ్చాడు. దేవుడా! దేవుడా! అని ఏడవకపోతే మీ జీవితాల్లోకి పత్రిగారు వచ్చేవారే కాదు.

"భగవంతుడు అంటే సత్యం". అంటే అన్నిటా, అంతటా సర్వం ఆయనే. పట్టుకుందామంటే దొరకడు, చూద్దాము అంటే కనబడడు.

అందుకే ఈ ఆత్మ ఐదు తొడుగులకి శక్తిని ఇస్తూ మానవుడికి కావలసిన జ్ఞానాన్ని పెంచుతుంది.

ప్రాణమయ కోశం ద్వారా శరీర సాధనకి, లోన పనులు జరగడానికి మనోమయ కోశం ద్వారా సృష్టిని గమనించుకుంటూ, సృష్టి ద్వారా జ్ఞానం నేర్చుకోవడానికి... విజ్ఞానమయ కోశం ద్వారా భగవంతుడు ఎవరో తెలుసుకునే అర్హత సంపాదించడానికి ఉపయోగ పడుతుంది.

అన్నిటిలో నేను ఉన్నాను అంటే సృష్టి అంతా ఆత్మమయమే కదా? అంటే అన్నిటిలో ఉన్నట్టే కదా? చూడండి ఇప్పుడు సముద్రం నిండా నీళ్ళు ఉన్నాయి, ప్రతీ కెరటంలోనూ నీళ్ళు ఉన్నాయి. అలాగే అన్నిటిలో ఆత్మ ఉంది, సృష్టి అంతా ఆత్మ ఉంది.

పరమాత్మే నేను, నేనే పరమాత్మ అన్నప్పుడు, సృష్టి అంతా నేనే ఉన్నాను కదా? నేను లేనిది ఎక్కడ? నేను కానిది ఎక్కడ ఉంది? మరలా వేరేగా నేను చూసేది ఏమి లేదు. ఇది నీకు అర్థమైనప్పుడు సృష్టి అంతా ఆత్మమయమే అని అనుకోగలిగి నప్పుడు ఇంక వేరేగా ఏమి ఉంటుంది?

భగవంతుడే సృష్టి అంతా నిండి ఉన్నాడు."సర్వం ఖల్విదం బ్రహ్మ" అని వేదాల ద్వారా మనకి తెలియపరిచారు కదా? సర్వం ఆత్మమయమే అంటే సృష్టి అంతా పరమాత్మే ఉన్నాడు అని నీకు అర్థం అవుతుంది.

"అహం బ్రహ్మోస్మి", "తత్వమసి", "సర్వం ఖల్విదం బ్రహ్మ" అని ప్రతిరోజు వింటున్నాం. కానీ అలా లేము కాబట్టి పదే పదే మననం చేసుకోవాలి. అందుకే మానవుడి మేధస్సు అసత్యాన్ని స్వీకరించ గలుగుతుంది, కానీ సత్యాన్ని

మననం చేసుకోలేక పోతుంది.

లోకంలో అసత్యం త్వరగా నమ్ముతారు. అందుకే గుళ్ళకి వెళ్ళే జనం కోట్లలో ఉంటారు, ధ్యాన మందిరాలకి వచ్చే జనం కొద్దిగా ఉంటారు.

అందరికి నమ్మకం ఎందుకు లేదు? అంటే భగవంతుడి గురించి తెలుసుకునే అర్హత లేదు, అర్హత లేకపోతే సత్యం అర్థం కాదు.

నువ్వు సత్యంలోనే ఉన్నావు, భగవంతుడి ఒడిలోనే ఉన్నావు, నీలోనే భగవంతుడు ఉన్నాడు. నీకు భగవంతుడి మీద తీవ్రాతి తీవ్రమైన భక్తి ఉంటే అంతా ఆయనే అని తెలుస్తుంది.

కొంతమంది దేవుడికి దండం పెట్టుకుని కోరికలు తీర్చమని, కష్టాలు తీర్చమని వేడుకుంటారు. కానీ దేవుడు ఎవరో తెలుసుకోవడానికే ఈ మానవ జన్మ ఇవ్వబడింది.

ఏ జీవికి కూడా భగవంతుని తెలుసుకునే అర్హత లేదు. ఒక్క మానవ జన్మకే అర్హత ఉంది. ఈ మానవ జన్మ తీసుకున్నాక కూడా కొంతమంది శరీర స్థితి, మనో స్థితి, బుద్ధి స్థితిలో ఉంటారు. ఆనందంగా ధ్యానంలోకి వచ్చి కూడా ఎంజాయ్ చేస్తున్నారు, ఎన్‌లైటెన్మెంట్ తర్వాత చూడొచ్చు అని.

బాహ్య విషయాల్లో నువ్వు ఆసక్తి చూపిస్తే ఆత్మ విషయాల్లో నీకు అశ్రద్ధ పెరుగుతుంది. అందుకే మన ఋషులు బాహ్యంగా నీ అవసరాలను చూసుకో, అంతరంగంలో నీ దృష్టి ఆత్మ మీదే ఉండాలి అని చెప్తారు. ఎప్పుడూ మీరు మిమ్మల్ని ప్రేమించే వారినే ప్రేమిస్తారు.

పరమాత్మ సృష్టిలో అణువంత లేని మీకే ఇలాంటి భావాలు ఉంటే, సృష్టి ద్వారా నీకు అన్నీ ఇస్తున్న ఆయన మీద దృష్టి లేని వాడికి ఇవ్వాల్సిన అవసరం భగవంతుడికి లేదు. అందుకే ఆయన మాయని పంపిస్తాడు.

అప్పుడే భగవంతుడు ఎవరో తెలుసుకునే అర్హత లేని వాడికి మాయ కమ్ముతుంది. ప్రతి క్షణము ఆ భగవంతుని శక్తిని నేను ధ్యానం ద్వారా మాత్రమే

తీసుకోగలను అని నువ్వు త్రికరణ శుద్ధిగా నమ్మగలిగితే జీవితంలో ఎప్పుడూ ధ్యానం వదలవు. అందుచేత అన్ని అనర్థాలకి మూలం ధ్యానం చేయకపోవడమే.

మానవ జన్మ తీసుకుని టైం లేదనో, సమస్యలనో, కష్టాలనో లేకపోతే నమ్మకం లేకో, ఇంకా ధ్యానాలు కూడా రకరకాల ధ్యానాలు చేస్తూ ఉంటే అది కూడా మాయే. మ్యూజిక్, గైడింగ్ అంటారు, కాని ధ్యానం అంటే నిశ్శబ్దం.

ఏ వేదంలో వ్రాసి ఉంది మ్యూజిక్ పెట్టుకుని ధ్యానం చేయమని? బుద్ధుడు మ్యూజిక్ పెట్టుకుని ధ్యానం చేశాడా? ఎవరు చెప్పారు గైడింగ్ ధ్యానం చేయమని? మన ఋషులందరు ఈ శబ్దాల నుంచి, ఈ తరంగాల నుంచి దూరంగా అడవులకు వెళ్ళి పోయి నిశ్శబ్ధంగా ధ్యానం చేస్తే, ఇంట్లో మ్యూజిక్ పెట్టుకుని కూర్చోవడం ఎంతో బుద్ధి లేని పని.

సత్యాన్ని అన్వేషిస్తున్నాం అనుకుంటూ అసత్యంలో జీవిస్తున్నారు. మేము పత్రిగారి దగ్గర 24 సంవత్సరాల నుంచి అయన చెప్పిన మాట విని ఇంకా, ఇంకా లోతుల్లో తెలుసుకోవాలని ఎన్నో సత్గ్రంథాలు చదివి, నిశ్శబ్దంలోకి వెళ్తేనే అంతర్శబ్దం వినబడుతుందని తెలుసుకున్నాము.

పత్రి గారు ఎప్పుడో మ్యూజిక్ ధ్యాన యజ్ఞాల్లో పెట్టారు. వీళ్ళు భగవంతుడికి నచ్చలేదు కాబట్టి అసత్యాన్ని ప్రేమిస్తున్నారు. ఎదగని ఆత్మలు వీళ్ళు, మీరు ఎదిగిన ఆత్మలు.

అందుకే బాహ్య ఆకర్షణలకి లొంగని వాడు భగవంతుని తప్పకుండా చేరుకుంటాడు. బాహ్య ఆకర్షణకు లొంగినవాడు భగవంతుడిని చేరుకునే అవకాశమే లేదు. అందుకే ప్రతి క్షణము భగవంతుడు మాయని పంపించి మన మీదకు వదులుతూ ఉంటాడు ఉంటామా? జారిపోతామా? అని.

మీ జీవితం జారిపోతున్న మెట్ల మీద అడుగు లేస్తున్నట్లు ఉంటుంది. జారుడు మెట్లు చాలా జాగ్రత్తగా చూసి నడవాలి. మీరు ఆధ్యాత్మిక జీవితంలో సత్యం తెలుసుకోవాలి అంటే మీ బుద్ధిని, మీ మేధస్సును ఉపయోగించి సత్యం

అంటే ఏమిటో గ్రహించగలగాలి. శబ్దమే వినగలిగితే కళ్ళు మూయడం ఎందుకు? కళ్ళు మూసి ధ్యానం ఎందుకు? అది ధ్యానమే కాదు కదా?

మంచి సంగీతం వింటున్నా శ్రవణానందమే కానీ, ఆత్మానందం రాదు. కానీ ఆత్మశక్తి పొందితేనే నీకు ఆత్మానందం వచ్చేది. ఆత్మ శక్తిని పొందకుండా ఆత్మానందం నీకు ఎలా వస్తుంది? జీవితంలో అనుక్షణము బాహ్య ఆకర్షణలే ఉంటాయి. ఎదిగే కొద్దీ ఆకర్షణలు ఎక్కువ కనబడతాయి మిమ్మల్ని లాగడానికి.

అందుకే మునులు బాహ్యాకర్షణ నిన్ను ఎంత ముంచుతున్నా, నీ దృష్టి ఆత్మ మీదే ఉండాలి అని. హృదయంలో ఉండేది భగవంతుడు ఒక్కడే, ఆయనది హృదయస్థానం, బుర్రలో ఉండే స్థానం ప్రపంచానిది.

నువ్వు ఆత్మవు అని గురువు చెప్తున్నాడు. "ఆత్మ అంటే సత్యం కదా? నువ్వు సత్యానివై ఉన్నావు, కానీ సత్యం అని తెలుసుకోలేకపోతున్నావు. కారణం బాహ్య ఆకర్షణలు తెలుసుకో నివ్వకుండా ఆపుతున్నాయి. అందుకని బాహ్య ఆకర్షణని తొలగించుకుంటే మాయను జయించిన వాడివి అవుతావు.

సృష్టి అంతా ఆయన చేతిలో ఉంది. కానీ మీ శరీరమే మీ చేతిలో లేదు. ధ్యానం చేస్తున్నప్పుడు దోమ కుడితే ఏం చేస్తారు? దోమని చంపేస్తారు. భగవంతుడు దోమచే కుట్టించి ధ్యానం నుంచి బయటకి లాగుతాడు. లేకపోతే మంచి దాహం వేస్తుంది, అప్పుడే గొంతు ఆరిపోతూ ఉంటుంది, ఇదీ మాయే. లేకపోతే శుభ్రంగా ధ్యానంలో కూర్చోవచ్చు కదా?

మూడు గంటల సినిమా చూస్తే దాహమే వేయదు, ఇదో రకం మాయ. అంటే నేను ఏకాగ్రతగా ధ్యానం చేయలేక పోవడానికి కారణం నా దృష్టి ఆత్మ మీద కంటే అన్య విషయాల మీద ఉంది కాబట్టే అని అర్థం అవుతుంది.

రాత్రి నిద్ర భగవంతుడు ఎందుకు పెట్టాడంటే మన ఇంద్రియాలన్నీ

పగలంతా పనిచేస్తాయి. కాబట్టి రాత్రి ఆ ఇంద్రియాలన్నిటికీ విశ్రాంతి ఇవ్వాలని, లేకపోతే రాత్రి కూడా మేలుకొంటే తింటూ ఉంటారు.

తెల్లవారు ఝామున 3 గంటల నుంచి 6 గంటల వరకు బ్రహ్మ ముహూర్తం. ఆ టైంలో ధ్యానం చేసి మిగతా ఖాళీ టైంలో కూడా ధ్యానం చేసుకోవచ్చు.

చాలామంది మనవాళ్లు మూడింటికే కూర్చుంటారు. ఫైనల్‌గా మనకి ధ్యానం ఎప్పుడు కుదురుతుంది అంటే? నేను చేస్తున్న ధ్యానం నేను ఎవరో తెలుసుకోవడానికి అని మీకు అర్థమైనపుడు.

ఇది అందరికీ దొరికే అవకాశం కాదు. పత్రిగారు లక్షల మందికి ధ్యానం చెప్పారు. కొందరు ఆరోగ్యం కోసం చేస్తున్నారు, కొందరు సంకల్పాలు నెరవేర్చుకోవడం కోసం చేస్తున్నారు,

కొంతమంది మాత్రమే ఆత్మ శక్తిని పెంచుకొని ఆత్మజ్ఞానం పొందాలని చేస్తున్నారు. అంటే పత్రిగారి శిష్యుల్లోనే ఇన్ని తేడాలు ఉంటే, సృష్టిలో ఇంకెన్ని తేడాలు ఉంటాయి?

సత్యం వింటున్నా, సత్యం తమోగుణంలో ఉన్నవాడికి ఒక రకంగా అర్థం అవుతుంది, రజోగుణంలో ఉన్నవాడికి ఒక రకంగా అర్థం అవుతుంది, సాత్వికగుణంలో ఉన్నవాడికి ఇంకో రకంగా అర్థం అవుతుంది. అందరికీ సత్యం తెలుసున్నా, ఆచరించలేని స్థితి వాడికి ఉన్న గుణాన్ని బట్టి ఉంటుంది.

కుంభకర్ణుడు ధ్యానం చేశాడు, రావణాసురుడు చేశాడు, విభీషణుడు చేశాడు, ఆంజనేయ స్వామి చేశాడు, రాముడు చేశాడు. రాముడు దేవుడయ్యాడు తర్వాత ఆంజనేయ స్వామికి, లక్ష్మణుడికి కూడా జ్ఞాన బోధ చేసి వాళ్ళని కూడా మోక్షానికి వెళ్ళే లాగా తయారు చేశాడు.

రావణుడికి ధ్యానం తెలుసున్నా అహంకారంతో ఉండడంవల్ల పడిపోవాల్సి వచ్చింది. ఇవన్నీ మనం చూస్తున్నప్పుడు నాకు ఆత్మ మీద దృష్టి

తప్పించి, అన్య విషయాల మీద నా దృష్టి ఉంది అంటే నేను ఇంకా తమో గుణంలోనో, రజోగుణంలోనో ఉన్నాను కానీ, సాత్వికగుణంలో లేను అని మీకే అర్థం అవ్వాలి.

ఎప్పుడైతే ఆత్మ కోసం కాకుండా శరీరం కోసమో, మనసు కోసమో ధ్యానం చేస్తున్నారు అంటే మీరు తమోగుణంలోనైనా, రజోగుణంలోనైనా ఉండాలి. ఆత్మ కోసమే సాధన చేసేవాడు ఖచ్చితంగా సత్వ గుణంలో ఉంటాడు, కాబట్టి ప్రాపంచిక కోరికలు కోరడు.

వాడికి "గురువు నువ్వు ఆత్మవి, సర్వ జీవులు ఆత్మమయమే" అని చెప్పాడు. వాడు వేరు, వీడు వేరు అనుకున్నారే కానీ, సత్యం అర్థం కాలేదు. అంటే ఖచ్చితంగా రజోగుణం, తమోగుణంలో ఉన్నట్టే. తమోగుణం, రజోగుణం పోయినప్పుడు మాత్రమే ఆత్మ మీద దృష్టి పెడతారు. ఆత్మ మీద దృష్టి పెట్టడము అంటే భగవంతుడి మీద దృష్టి పెట్టడమే.

ఆయన సృష్టిలోకి నువ్వు వచ్చావు, సృష్టిని అనుభవిస్తున్నావు. ఆయన నీలో ఉండి నీ శరీరాన్ని కాపాడుతున్నాడు. నువ్వు ఆయన మీద దృష్టి పెట్టి ఆయన దర్శనం పొందిన రోజున నీకు ఈ ఏడుపుల ప్రపంచం అక్కర్లేదు. అక్కడ శాశ్వతానందం పొందొచ్చు అని గురువు ద్వారా తెలుసుకుంటావు.

అంటే దుఃఖాలకు, రోగాలకు, ఈ భోగాలకి అలవాటైన మనసు యోగంలోకి రావడానికి మొండికేస్తుంది. ప్రతి వ్యాపారస్తుడు లాభం ఆశిస్తాడు. ఈ బుద్ధి జన్మ జన్మల నుంచి వచ్చి ఈ జన్మలో కూడా ధ్యానం చేస్తే నాకు లాభం ఏమిటి ? అంటుంది.

భగవంతుడా నా జీవితంలో దుఃఖం ఎందుకు వచ్చింది? అందరూ బాగానే ఉన్నారు, నేను ఎందుకు ఏడుస్తున్నాను? అంటే గురువు దొరికినా ఆయన మీద దృష్టి పెట్టలేదు కాబట్టి. ధ్యానము అంటే భగవంతుడి మీద దృష్టి పెట్టడం అని మీరు తెలుసుకున్నారు కాబట్టి మీరు ఆయన మీద దృష్టి పెడుతున్నారు.

ధ్యానాన్ని ఆయన సృష్టించిన ప్రపంచం కోసం కూడా వాడుకోవచ్చు. కాని నువ్వు ఆయన మీద దృష్టి పెట్టాలి అని గురువు వచ్చి చెప్పినా నువ్వు ఆత్మ మీద దృష్టి మానేసి, అన్య విషయాల మీద దృష్టి పెట్టావు అంటే నీకు అర్హత లేదని అర్ధం.

అందుకే భగవంతుడు కష్టాలు ఇచ్చి తన వైపు తిప్పుకుంటాడు. గురువుని పంపి "ధ్యానం వల్ల జ్ఞానం, జ్ఞానం వల్ల మోక్షం" అని స్పష్టంగా తెలియ పరుస్తాడు. నా కోడలికి కొడుకు పుట్టాలి, నా కూతురు పెళ్లి అవ్వాలి అనే కోరికలు ఒక్కటి కూడా ఇక్కడి నుంచి పట్టుకెళ్ళని, పనికి మాలిన కోరికలు.

మనవళ్ళని, ముని మనవళ్ళని అడుగుతారు, సంపదలు అడుగు తారు, పదవులు అడుగుతారు. ఇక్కడి నుంచి ఏదీ పట్టికెళ్ళని పనికిమాలిన కోరికలు కోరి ఇంకా భగవంతుడికి దూరం అవుతున్నారు. నేను నిన్ను ప్రేమించను, నీ సృష్టిని ప్రేమిస్తాను అని చెప్పినట్టుఉంది

జ్ఞాని ఆ కొద్ది టైంలోనే సాధన చేస్తాడు, ఆ కొద్ది టైంలోనే పుస్తకాలు చదువుకుంటాడు, ప్రాపంచిక విషయాల్లో తన అవసరాలను చూసుకుంటూ ఆధ్యాత్మిక విషయాల్లో తన పురోగమనాన్ని చూసుకుంటాడు.

అందుకే భగవంతుడి మీద భక్తి ఎందుకు ఉండాలంటే? నీవు లేచిన దగ్గర నుంచి పడుకునే వరకు ఎరుకలో ఉన్నా, ఎరుకలో లేకపోయినా భగవంతుడు నీకు శక్తి ఇస్తూనే ఉన్నాడు, నిన్ను చూసుకుంటున్నాడు. అలాంటి భగవంతుని మీద కాసేపు దృష్టి పెట్టడమే ధ్యానం.

ఆయన ఒక కండిషన్ పెడతాడు. నా మీద దృష్టి పెడితే నీ కోరికలన్నీ తీరుతాయని. ఆయన మీద నమ్మకం లేక మీరు మీ కోరికలు తీర్చుకుందామని అనుకుంటారు. అందుకే భగవంతుడి మీద భక్తి ఉన్నవాడు సాధన వదలడు.

భగవంతుడి దగ్గరికి చేరుకోవడానికి ఒక మీడియా గురువు, ఆయన వైపు తిప్పడానికి గురువు వచ్చాడు. నాకు ఎన్ని రోజుల నుంచీ ఈ దారి తెలియలేదు, ఇప్పుడే తెలిసింది అంటే భగవంతుడే గురువుని పంపాడు అని

ఆ గురువు మీద నమ్మకం ఉండాలి, నమ్మకం ఉన్నప్పుడు ఆయన చెప్పిన సాధన చేస్తారు.

విశ్వసించని వాడు విశ్వమంతా తిరిగినా తన దుఃఖం పోగొట్టు కోలేడు. గురువుని విశ్వసించిన వాడు కూర్చున్న చోట కూర్చుంటేనే తన దుఃఖాన్ని పోగొట్టుకుంటాడు.

నీకు ఆత్మ మీద తపన ఎంత ఉంటే, అంతగా మీరు సత్యానికి దగ్గర అవుతున్నట్టే లెక్క. ఆత్మ మీద తపన లేకపోతే బాహ్యంలోకి వెళ్ళిపోతారు, మళ్ళా కర్మల జీవితంలోకి వస్తారు.

సత్యాన్ని చేరుకోవాలంటే బాహ్య జీవితంలో ఉన్నప్పుడు కొంచెం తిండి ఉండాలి, నిద్ర ఉండాలి, అవి అనుభవించడానికి కావలసిన వనరులు వుండాలి. అవి అనుభవిస్తూ సాధనలో ఉండగలగడమే.

ఈరోజు నేను ఏం నేర్చుకున్నాను? ఎంత జ్ఞానం వచ్చింది? ఇవన్నీ ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి. ఆత్మకి ఆహారం ధ్యానమే!

మీరు జ్ఞానం పెంచుకున్న కొద్దీ ఈ జీవితం అనే జైల్లోనుంచి బయటకి వస్తారు. అందుకే ఋషులు ఈ మలబాండంలో నుంచి బయటికి రావడానికి చూస్తారు.

అందుకే దేహం ఉండగానే సాధన, జ్ఞానం పెంచుకుంటే ఇందులో నుంచి విముక్తి పొందుతారు. అందుకే ఎంతసేపు ఆత్మ గురించి ఆలోచిస్తారో సత్యానికి అంత చేరువవుతున్నట్టు, ప్రపంచం గురించి ఆలోచిస్తే సత్యానికి దూరమవుతారు.

# త్యాగమే అసలైన సద్గుణం

ఆత్మజ్ఞానం మీద ఎన్నో క్లాసులు వింటున్నారు. కాని తెలుసుకున్న దాన్ని జీవితంలో అనుభవంలోకి తెచ్చుకున్నప్పుడే ఫలితం ఉంటుంది. ఏదైనా విని వదిలేస్తే దాన్ని విషయ సేకరణ అంటారు. అనుభవంలోకి తెచ్చుకున్నప్పుడే మనకి జ్ఞానం వస్తుంది.

అందుకే పత్రిగారు అనుభవమే జ్ఞానం అన్నారు. అనుభవంలో నువ్వు ఏదైతే పొందుతావో అదే జ్ఞానము. గురువులు ఎప్పుడూ సత్యమే చెప్తారు. కానీ మీరు అనుభవంలోకి తెచ్చుకుంటూ సత్యం ఇలా ఉంటుంది అనే అనుభవం పొందాలి. జ్ఞానం పొందడానికి ఎన్నో విషయాలు గురువులు నేర్పినా, మీరు ఎన్ని నేర్చుకున్నా ఇంకా, ఇంకా నేర్చుకోవాల్సి ఉంటుంది.

ఒక్కొక్కసారి ఎన్ని నేర్చుకున్నా మీ మనసు మాయకి వశమై దుర్గుణాలకు దగ్గర అవుతుంది. కానీ ఆత్మవిద్య నేర్చుకునే మీరు ఎప్పుడూ సద్గుణాలను అలవాటు చేసుకుంటూ, దుర్గుణాలకు దూరంగా ఉండాలి. మాయ ఎప్పుడైతే మనసుని ఆక్రమిస్తుందో అప్పుడు దుర్గుణాలు అలవాటు అవుతూ ఉంటాయి. వాటిని వదలడం కూడా కష్టమే అవుతుంది. సద్గుణ సంపన్నుడే పరమాత్మకి ప్రీతి, అతనే పరమాత్మని చేరుకోగలడు.

మనకి ఋషులు చెప్తూ ఉంటారు గొప్ప సద్గుణం ఏమిటి? అంటే "త్యాగం". ఆ త్యాగం వలన మాత్రమే మానవుడు "అమృత స్వరూపుడు" అవుతాడు. త్యాగం అనే గుణం మీలో ఎంతగా పెరుగుతుందో, ఎంతగా వికసిస్తుందో అంతగా మీరు భగవంతుడికి దగ్గర అవుతారు.

భగవంతుడు మీలో త్యాగం అనే గుణాన్ని మెచ్చుకుంటాడు. త్యాగం వల్ల మాత్రమే మీరు జన్మ రాహిత్య స్థితి, మోక్షము పొందుతారు. త్యాగం చేసిన మహాపురుషులు ఎంతో మందిని గురించి తెలుసుకున్నాం. వారు దధీచి

మహర్షి, శిబి చక్రవర్తి, బలి చక్రవర్తి మొదలైన వారు. ఇలాంటి వాళ్ళు చేసిన త్యాగం ఎంతో గొప్పది కాబట్టే ఈ రోజుకీ అందరూ వాళ్ళని తలుచు కుంటున్నారు.

వారు అలాంటి గుణాల వల్లే భగవంతుడికి దగ్గరయ్యారు అని మనకి అర్థమవుతూ ఉంటుంది. మోక్షాన్ని కోరే వారు కానీ, జన్మ రాహిత్యాన్ని కోరేవారు కానీ, ముక్తిని కోరేవారు కానీ, వీళ్ళు మాత్రమే ప్రాపంచిక విషయాల పట్ల వైరాగ్యం, భగవంతుడి పట్ల అనురాగం కలిగి ఉంటారు. ప్రాపంచిక విషయాలు ఎంత ఇష్టమైనా వాళ్ళు త్యాగం చేస్తారు.

ఇప్పుడు చూస్తే చాలామందికి మాంసాహారం ఇష్టం. భగవంతుని కోసం, భగవంతుని చేరుకోవడం కోసం, మోక్షం పొందడం కోసం తపనతో ఇష్టమైన మాంసాహారాన్ని త్యాగం చేశారు. అంటే వాళ్ళకి భగవంతుడంటే ఎంత ప్రీతో చెప్పలేము. శాఖాహారం తినేవారు ధ్యానం చేయడం పెద్ద గొప్ప కాదు.

ధ్యానం నా కోసం నేను చేస్తున్నాను. నేను భగవంతుని చేరుకోవడానికి చేస్తున్నాను. హింస అనేది నా జీవితంలో ఉంటే నేను భగవంతుడికి దూరం అవుతాను అని వాళ్ళు నిర్ణయం తీసుకున్నారు.

తెలియనప్పుడు చేస్తే అజ్ఞానం, తెలిసి కూడా చేస్తే మూర్ఖత్వం. అంత గొప్ప గురువు దగ్గర ఉండి మీరు సత్యాన్ని తెలుసుకుని, ధర్మాన్ని ఆచరించి ఈ సాధన చేస్తున్నారు కాబట్టే మీరు ఇంతమందికి ఇన్ని విధాలుగా చెప్తు మాంసం మాన్పించారు, నిజంగా మానేసిన వాళ్ళంతా చాలా త్యాగం చేశారు.

కానీ భగవంతుడు కావాలంటే, దక్కాలంటే, చేరాలంటే, ప్రాపంచికాన్ని వదులుకొని మీకు ఇష్టమైనవి కొన్ని త్యాగం చేయాలి. అలాగే ప్రతి వాళ్ళ జీవితంలో చిన్నవి అవనివ్వండి, పెద్దవి అవనివ్వండి, ఆధ్యాత్మికంగా

ఎదగాలంటే ప్రాపంచిక విషయాల్లో కొన్ని కొన్ని త్యాగం చేయాలి.

నాకు వెల్లుల్లిపాయ చాలా ఇష్టం, అన్నిట్లోను వేసేదాన్ని. పత్రిగారు ఫస్ట్ టైం మా ఇంటికి వచ్చినప్పుడు వెల్లుల్లి తినకూడదు అని చెప్పారు. ఇంక ఆ రోజు నుంచి మా ఇంట్లో వెల్లుల్లిపాయే తేలేదు, అంటే చిన్నవి వదులుకుంటేనే పెద్దవి పొందే అవకాశం ఉంటుంది. పువ్వులు కూడా ప్రొద్దున కనకాంబరాలు, రాత్రులు సన్నజాజులు, విరజాజులు, మల్లెలు కంపల్సరీగా పెట్టుకునేదాన్ని.

పత్రిగారు పువ్వులు కొయ్యకూడదమ్మా! అని చెప్పారు. నిజమే తప్పు చేసాం, గురువులు నీ ప్రాణం అంటే నీకు ఎంత తీపో, నీ బిడ్డలు క్షేమంగా ఉండాలని నువ్వు ఎలా అనుకుంటున్నావో, ఆ చిట్టి తల్లి కూడా తన బిడ్డ క్షేమంగా ఉండాలని కోరుకుంటుంది అని చెప్పారు. విచారణ చేస్తే అర్థం అయ్యింది, పువ్వులు కూడా తెంపడం మానేసాను, ఇవి చిన్న, చిన్న త్యాగాలు, ఇవేమి పెద్ద, పెద్ద త్యాగాలు కాదు.

కానీ అలా త్యాగమయ జీవితం ఉంటేనే మీరు పరమాత్మకి చేరువవుతారు. భగవంతుడు మిమ్మల్ని దగ్గరకి తీసుకోవాలంటే మీ జీవితంలో చిన్న, చిన్న త్యాగాలు తర్వాత పెద్ద పెద్దవి ఓ దధీచి మహర్షిలాగా చేయగలగాలి. కానీ ముందు చిన్నవి అలవాటు చేసుకోవాలి.

చూడండి మీ స్థాయిని బట్టే మీకు సవాళ్లు ఉంటాయి, పరీక్షలు ఉంటాయి. అందుకే ప్రతి వాళ్ళు కూడా కష్టపడి సంపాదించిన దానితోనే తృప్తిగా జీవించాలి. చాలామంది మహాత్ములు కష్టపడకుండా ఏదీ పొందే హక్కు లేదు ఈ భూమిమీద, ప్రతివాడు కర్మ చేసి తనకు ఏం కావాలో అది కష్టపడి తీసుకోవాలి అని చెప్తారు.

మానవుడు కర్మజీవి, యోగజీవి అంటే పనులు చేయాలి, చేయకపోతే నిరర్థక జీవి. ప్రతి వాళ్ళు కర్మలు చేయాలి కానీ ఆ కర్మలన్నీ పుణ్య కర్మలు, సత్కర్మలు కావాలి కానీ పాప కర్మలు చేయకూడదు.

కష్టపడకుండా మీరు సుఖపడిపోవాలి అని ఎప్పుడూ కోరుకోకూడదు, ఎదుటివాడి కష్టార్జితాన్ని అన్యాయంగా, అక్రమంగా ఎప్పుడూ దోచుకోకూడదు. నీది నువ్వు సుఖపడితే తప్పులేదు, ప్రక్కవాడిది తీసుకుని సుఖపడాలని కోరుకుంటే అది స్వార్ధ బుద్ధి, అలా ఎప్పుడూ ఉండకూడదు.

అందుకే మనలో మంచి గుణాలు పెరగాలి, అంటే సేవ, ప్రేమ, క్షమ, త్యాగం ఇట్లాంటి మంచి గుణాలు పెరిగినప్పుడే నువ్వు ఆత్మ స్థితిలోకి ఎదగగలవు. నువ్వు ఆత్మగా ఎదగాలి అంటే నువ్వు ఆత్మగా జీవించాలి అంటే మొదటి మెట్టు సేవ, రెండో మెట్టు ప్రేమ, త్యాగం, దానం ఇవన్నీ పరమాత్మకి దగ్గర అయ్యేటట్టు మిమ్మల్ని చేస్తాయి.

ఎప్పుడూ మీరు లోభిగా, పిసినారిగా అస్సలు ఉండకూడదు. ఎందుకంటే అన్ని ఉపనిషత్తుల సారం మీరు తెలుసుకుంటున్నారు, భగవద్గీత సారాన్ని తెలుసుకుంటున్నారు. భగవద్గీత అంటే మనిషి భగవంతుడిగా ఎదగడానికి వ్రాయబడిన గీత.

ఏ దానం చేసినా నేను కాదు, భగవంతుడు నా చేత చేయిస్తున్నాడు అనే అభిప్రాయంతో చేస్తే అది సత్కర్మ అయి, యజ్ఞకర్మై నిన్ను పరమాత్మ వైపుకు నడిపిస్తుంది అని గీతలో చెప్పడం జరిగింది.

అందుకే లోభి ఏనాటికీ పురోగతి పొందలేడు. అంటే సంపాదించింది ఖర్చు పెట్టని వాడిని లోభి అంటారు, ఎవ్వరికీ పెట్టని వాడిని పిసినారి అంటారు. మీరు ఎవ్వరికీ పెట్టకుండా ఖర్చు పెట్టుకుంటూ దాయాలి అని అనుకుంటే వాడు ఎన్నటికీ ఆత్మజ్ఞానం, పొందలేరు. ప్రజలకి అపకారం చేసినవాడికి ఆత్మజ్ఞానం రాదు.

చూడండి తెల్లని గోడ మీద నల్ల మచ్చ చిన్నది అయినా స్పష్టంగా కనబడినట్టు, మీలో దుర్గుణాలు ఉంటే పరమాత్మకి ఖచ్చితంగా దగ్గరయ్యే అవకాశాలు చాలా తక్కువ ఉంటాయి.

అందుకే పూర్వం మహాత్ములు చెప్పేవారు

**నీది నువ్వు అనుభవిస్తే ప్రకృతి.**

**ఎదటివాడిది అనుభవిస్తే వికృతి.**

**నీది కూడా ఎదటివాడికి ఇస్తే సంస్కృతి.**

అంటే నీది నువ్వు అనుభవించడంలో తప్పేమి లేదు, పాపము లేదు, అది ప్రకృతి.

కానీ ఎదుటివాడిది అనుభవిస్తే వికృతి అన్నారు. అంటే వ్యతిరేకమైన పని, చాలా తప్పుడు పని. ఎదుటివాడిది అన్యాయంగా కానీ, అక్రమంగా కానీ, దొంగతనంగా కానీ తీసుకుంటే నువ్వు పరమాత్మ వైపు చూస్తున్నట్టు ఉంటావు కానీ వెనక్కి, వెనక్కి వెళ్ళిపోతావు అది వికృతి.

నాకు లేకపోయినా పర్వాలేదు, ప్రక్కవాడి కడుపు నిండితే చాలు అనుకొని నీది కూడా ప్రక్కవాడికి ఇస్తావు అది సంస్కృతి, అంటే సనాతనమైన ధర్మం. ఆ సంస్కృతిలో నువ్వు ఉంటే చాలా గొప్పగా ఎదుగుతావు అని ఋషులు చెప్పడం జరిగింది.

అందుకే ప్రజలకి ఉపయోగపడే పనులు చేస్తే అది పుణ్యకార్యం. నాకెందుకు? నేను ఎందుకు చేయాలి? నాకేం అవసరం? నా సంసారం సుఖపడితే చాలు, నా పిల్లలు, భార్య సుఖపడితే చాలు, ప్రక్క వాడి గొడవ నాకు ఏందుకు? అని చాలా మంది అనుకుంటారు.

కానీ కొంచెం త్యాగ బుద్ధితో ఆలోచిస్తే మీ డబ్బు కానీ, మీ శక్తి కానీ కొంచెం త్యాగం చేసి ప్రక్కవాడి గురించి ఖర్చు చేస్తే ఎంత ఆనందం పొందుతామో అది చేసిన వాడికే తెలుస్తుంది. ప్రజల హృదయంలో నువ్వు దేవుడిగా మెదులుతూ ఉంటావు.

ఒకడు బాగా చదువుతున్నాడు, వాడికి ఫీజ్ కట్టడానికి కూడా డబ్బు లేదు. అప్పుడు మీరు కొంచెం డబ్బు సాయం చేస్తే వాడు చదువుకుని, పాస్

అయ్యి, ఉద్యోగం చేసి చివరి వరకు, ఫలానా వ్యక్తి వల్ల ఈరోజు నేను ఈ స్థాయిలో ఉన్నాను అని ఆనంద పడుతూ ఉంటాడు.

ఎదుటివాడి ఆనందంలో మీరు ఆనందం వెతుక్కోవడం చాలా అద్భుతమైన ఆనందంగా ఉంటుంది. వాడు జీవితాంతం మిమ్మల్ని గుర్తుపెట్టుకుంటూనే ఉంటాడు.

వివేకానందులవారు నీ క్రింద వాడికి నువ్వు సేవలు అందిస్తే, నీపై వాడి నుంచి పొందడానికి నువ్వు రెడీగా ఉంటావు అంటారు. మన క్రింద వాళ్ళకి మనం ఇవ్వగలిగితే మన పై వాడు మనకి ఇస్తాడు. భగవంతుడు చూసేది మీరు ఎలా ఉన్నారు? ఎలా జీవిస్తున్నారు? ఎంత త్యాగం చేస్తున్నారు? అన్నదే.

అలాగే ఎవరైనా హాస్పిటల్కి వెళ్ళాలి, డబ్బు లేదు. ప్రాణం పోతున్న టైంలో రోడ్డు మీద వదలకుండా కొంచెం సాయం చేస్తే, సరైన సమయానికి వైద్యం అందిస్తే వాడు జీవితాంతం ఎంతో కృతజ్ఞతతో ఉంటాడు.

మిమ్మల్ని చూసి దుర్మార్గుడు కూడా మారిపోయేంత, నేర్చుకునేంత గొప్ప గుణం త్యాగంలోనే ఉంటుంది. మీ సుఖాలను వదులుకోమని చెప్పరు, కానీ రూపాయి ఖర్చు పెట్టుకున్నప్పుడు ఒక్క 10 పైసలు ప్రక్కవాడికి ఇవ్వగలిగినంత త్యాగ గుణం ఉంటే అది భగవంతుడి దృష్టిలో చాలా గొప్ప గుణం.

ఎదుటి వాళ్ళని బాధ పెట్టి, పాప కర్మలు చేసేది మీరే. ప్రజలకి ఉపకారం చేసి పుణ్యకర్మలు చేసేది మీరే. ఈ రెండు కర్మలు, జన్మలకి కారణం అవుతాయి. మళ్ళీ దుఃఖము, బాధ అనుభవించ వలసి వస్తుంది.

అయితే శ్రీ కృష్ణ భగవానుడు నిరంతరము కర్మచేయి, ఆ కర్మ ఫలితం పరమాత్మకు అర్పించు, ఇది అన్నిటికంటే గొప్ప త్యాగ గుణం అన్నాడు. పుణ్యకర్మ మనం చేసి, భగవంతుడు చేయిస్తున్నాడు అనే కర్మఫలాన్ని మొత్తం

భగవంతుడికి త్యాగం చేయాలి.

మనం వదలడానికి బాధపడుతున్నాం, ఇవ్వడానికి బాధపడుతున్నాం. కానీ నీ సమస్త కర్మ ఫలం ఏ పుణ్యం అయితే చేసి భోగాలు కోరుకుంటున్నావో, అది నేను చేస్తున్నాను అన్నప్పుడు దాని ఫలం తాత్కాలికం.

నేను చేస్తున్నాను అనే భావంతో చేసే పుణ్య కర్మ వల్ల ఒక జన్మే భోగం అనుభవించొచ్చు. కానీ భగవంతుడే నా చేత చేయిస్తున్నాడు అనే కర్మఫల త్యాగం నువ్వు చేయగలిగితే నిన్ను శాశ్వతమైన ఆనంద స్థితిలో ఉంచే డ్యూటీ ఆయన తీసుకుంటాడు. అంటే మోక్షం వచ్చే అర్హత నీ కర్మఫల త్యాగంలోనే ఉంది.

కానీ ఇలాంటి పరమ సత్యాలు స్వార్థపూరితమైన జీవితం ఉన్నవాళ్ళకి, మోసపూరితమైన జీవితం ఉన్నవాళ్ళకి, బద్ధ కస్తులకి, సోమరిపోతులకి ఇలాంటి బుద్ధి వాళ్ళ జీవితాంతం ప్రయత్నించినా రాదు. వారు పాప కర్మలు చేస్తారు, లేదా గుడికి వెళ్ళి కొబ్బరికాయ కొట్టో, ఏదైనా చిన్న దానం చేసో పుణ్యకర్మ చేస్తారు.

ఈ సత్కర్మలు, మోక్షం వచ్చే కర్మలు వాళ్ళకి చేసే అర్హత లేక ప్రకృతి వల్ల వీళ్ళకి పాపము, పుణ్యం వరకే తెలుస్తుంది.

గమనిస్తే భగవద్గీత 5వేల సంవత్సరాల క్రితం వచ్చినా, నేను 20 సంవత్సరాలు భగవద్గీత చదివినా అర్థం కాలేదు, కర్మ ఫల త్యాగం అంటే ఏమిటి? కర్మ ఎందుకు చేయాలో తెలియలేదు, కర్మ సన్యాసం ఎందుకు చేయాలో తెలియలేదు.

కానీ పత్రిగారు వచ్చాక అర్థమయింది, ఏ మనిషీ సోంబేరిగా ఉండకూడదు, తన తిండి తానే సంపాదించాలి. కష్టపడి పని చేయాలి, అది తినడానికి నీకు హక్కు అప్పుడు వస్తుంది అని చెప్పారు.

అలాగే నువ్వు చేసే ప్రతి మంచి పని నువ్వు చేస్తున్నానని శరీరానికి

పెద్ద పీట వేస్తున్నావు. నువ్వు ఏం చేయట్లేదు నీలో ఆత్మ ఉండి నీ చేత చేయిస్తుంది, అందుకని ఫలితం ఎప్పుడూ కోరకూడదని తెలిసింది. అప్పుడు అర్థమైంది కర్మ సన్యాస యోగంలో అంతరార్థం.

అందుకే సద్గురువులు మీ జీవితంలోకి వచ్చేవరకు మీది ఎడారి జీవితం. ఎండమావుల వెంట పరిగెట్టి అక్కడ నీళ్లు లేక అలసిపోయారు. అంటే సుఖాలు ఉన్నాయని భ్రమపడితే ఎండమావులు కనిపించాయి. అక్కడ నీళ్లు ఉన్నాయని పరిగెడుతున్నారు నీళ్లు లేవు, మళ్ళీ దుఃఖం వస్తుంది.

మీలాంటి వాళ్ళు ఎండమావుల వెంటే పరిగెట్టారు, ఎడారుల్లో తిరిగారు. సుఖం, సంతోషము తాత్కాలికమే, మీ మనసులను మల్లె తోట లాగా తయారు చేసుకుప్పుడు ఆనంద స్థితిలో ఉంటారు.

శాశ్వత ఆనంద స్థితి ఇచ్చే కర్మ ఏదైతే ఉందో అది సద్గురువులు మాత్రమే బోధించగలరు. బాధ గురువులు, శాశ్వతానంద స్థితిని ఇచ్చే కర్మని చెప్పలేరు.

ఒక సద్గురువు మాత్రమే శాశ్వతానంద స్థితి కలుగచేసే గొప్ప కర్మ ధ్యానము చెప్తారు. మన చేత ధ్యానం చేయిస్తూ, విచారణ ద్వారా నీకు చెడ్డ అనిపించింది వదిలేయ్, మంచి అనిపించింది చెయ్యి అని చెప్తారు.

ఏదైతే నీకు బాధ కలుగుతుందో అది ఎదటివాళ్ళ విషయంలో ఎప్పుడూ చేయొద్దు. నీకు బాధ కలిగేది చేయకుండా ఉంటే అది పుణ్యకర్మే. నీకు బాధ కలుగుతున్నా ఎదటివాడే కదా అని నువ్వు చేస్తే పాపం రెట్టింపు అవుతుంది.

అందుకే ప్రతిదానికి విచారణ, విచారణ. నువ్వు ఏం చేస్తున్నా ఈ శరీరం ఏమి చేయట్లేదు, నీ శరీరంలో ఉన్న ఆత్మ అనే భగవంతుడు ఉండి నీ చేత సత్కర్మలు చేయిస్తున్నాడు.

నువ్వు భగవంతుడి వైపు తిరగడం అంటే గుళ్ళల్లో విగ్రహం ముందు

కూర్చోవడం కాదు అంతర్ముఖం అవ్వడం. భగవంతుడు ఎక్కడ ఉన్నాడు? అనే సత్యాన్ని గురువు ద్వారా విన్నప్పుడు అక్కడే వెతకాలి. ఎందుకు? అంటే పరమాత్మ పంపించిన వాడే గురువు.

కాబట్టి నీ సత్ప్రవర్తనకు సద్గురువు వస్తాడు, దుష్ప్రవర్తన అయితే సద్గురువులు మన జీవితంలోకి రారు. అప్పుడు మొదలవుతుంది అసలైన త్యాగం. మీరు ఈ స్థాయికి వచ్చినప్పుడు మీరు తినకపోయినా పర్వాలేదు, ప్రక్కవాడు తింటే ఆనందం.

ప్రక్కవాడు జ్ఞానం బాగా చెప్తుంటే ఆనందం. ఏ పని చేస్తున్నా మీకు ఈర్ష్య, అసూయ, ద్వేషాలు ఎంతగా తగ్గిపోతాయి అంటే ప్రక్కవాడి అభివృద్ధిని కోరుతూ, వాళ్ళ అభివృద్ధి పొందారు అంటే చాలా సంతోషం వేస్తుంది.

అంటే ఇక్కడ ఏమైంది ఈర్ష్య అనే గుణాన్ని త్యాగం చేశారు, స్వార్థం అనే గుణాన్ని త్యాగం చేశారు, అహంకారం అనే గుణాన్ని మీరు త్యాగం చేశారు. దుర్గుణాలని త్యాగం చేసి సద్గుణాలని అలవాటు చేసుకున్నారు.

అందుకే మీకు ఈ మార్గంలోకి వచ్చేవరకు సత్యం, అసత్యం తెలియదు, జ్ఞానము, అజ్ఞానము తెలియదు, ఇక్కడికి వచ్చాకే సరైన జీవన విధానం జీవిస్తున్నారు. మానవుడిగా పుట్టి మీరు ఏం చేయాలో అది చేస్తున్నారు కాబట్టే ఇప్పుడు ఎంతో ఆనంద స్థితిలో ఉంటున్నారు.

అందుకే ఒక జ్ఞాని జీవితంలో త్యాగానికి ఉన్న విలువ జ్ఞానికి తెలిసినంతగా మిగతావాళ్ళకి ఎవ్వరికీ తెలియదు. ప్రాపంచిక జీవితం స్వార్థంతో ఉంటుంది, నేను డబ్బు సంపాదించాలి, నా భార్య పిల్లలే సుఖపడాలి అనుకుంటారు.

కానీ ఇక్కడికి వచ్చాక ఈ విద్య నేర్చుకున్నాక ఉపనిషత్తుల ద్వారా ఎలా బ్రతకాలో నేర్చుకున్నారు. భగవద్గీత ద్వారా ఏది ఆచరించాలో

నేర్చుకున్నారు.

అందుకే శ్రీ కృష్ణభగవానుడు కర్మ సన్యాస యోగంలో నువ్వు చేసే ప్రతి పుణ్య కర్మ త్యాగంతో పరమాత్మకి అర్పిస్తే తాత్కాలిక ఆనందమే కాదు, శాశ్వత ఆనంద స్థితిలో ఉండేటట్టు భగవంతుడే చూసుకుంటాడు అని ఈ మార్గాన్ని మనకి ఇవ్వడం జరిగింది.

అందుకే మహాత్ములందరూ త్యాగ పురుషులు. వాళ్ళని చూసి మనం కూడా చిన్న చిన్న త్యాగాలు చేయడం అలవాటు చేసుకోవాలి. త్యాగం అంటే ప్రతిదీ ఇచ్చేయడం కాదు. సహించడం, భరించడం కూడా త్యాగమే, నా దగ్గర ఏముంది అంటే ఓర్పు ఉంది. దాన్ని కూడా త్యాగం చేయాలి ఎందుకు? అంటే ఓర్చుకుంటేనే నేర్చుకుంటామని తెలుసు కాబట్టి ఓర్చుకోవాలి.

ఇప్పుడు మీ జీవితంలో ఈర్ష్య, అసూయ, ద్వేషం ఇవన్నీ మెల్లి మెల్లిగా తొలగిపోయి సేవ, ప్రేమ, క్షమ, త్యాగం లాంటి గుణాల్ని అలవాటు చేసుకుంటే మీరే దైవాలు కాగలరు.

ఏది అలవాటు చేసుకుంటే ఆయనకి దగ్గర అవుతాం? ఏ అలవాట్లు ఉంటే ఆయనకి దూరం అవుతామో తెలుసుకొని దూరమయ్యే అలవాట్లు వదులుకొని, దగ్గరయ్యేవి అలవాటు చేసుకుంటే ఇదే చివరి జన్మ చేసుకునే అవకాశం ఉంటుంది.

# జ్ఞాని, అజ్ఞాని యొక్క జీవన విధానం

మీరు ఒక జ్ఞాని – అజ్ఞాని ఏ విధంగా జీవిస్తారో తెలుసుకుంటే మీరు అజ్ఞానం నుంచి, జ్ఞానం వైపు పయనిస్తారు. మరి ఏ లక్షణాలు ఉంటే మీరు అజ్ఞానంలో ఉన్నట్టు అన్నది తెలుసుకుందాం.

ఎందుకంటే? మీరు ఇందులోకి వచ్చినంత మాత్రాన అన్ని తెలుస్తాయని కాదు, కారణం మీరు ఎంత ఎదిగినా ఎదగవలసింది ఉంటుంది, నేర్చుకోవాల్సింది ఉంటుంది, అలవాటు చేసుకోవాల్సింది ఉంటుంది. అందుచేత ఈ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రతి క్షణము నేర్చుకోవాలి.

మీరు ఎదుగుతున్నారు, అందుచేత నేను ఎదిగిపోయాను అనుకుంటే అహంకారం, నాకు అన్ని తెలిశాయి, నేను నేర్చుకోవాల్సింది లేదు, నాకు ఎవరు చెప్పక్కర్లేద్దు, అనుకుంటే మీరు ఇంకా అజ్ఞానంలో ఉన్నట్టే. మీ జీవితంలో ఏ సంఘటనలు జరుగుతున్నా స్వీకరించే మనస్తత్వం ఉండాలి.

నువ్వు ఇష్టపడినా, ఇష్టపడక పోయినా జరిగేవి జరుగుతూ ఉంటాయి. కాబట్టి నాకు ఇది ఇష్టం, నాకు అది అయిష్టము అన్నారు అంటే బాధపడవలసింది మీరే. ఇలా ఎందుకు జరుగుతుంది నా జీవితంలో అనుకునే బదులు, జరుగుతున్నవన్నీ నా మంచికే జరుగుతున్నాయి అనుకుంటే మీకు ఎప్పుడూ దుఃఖం ఉండదు.

మీరు ఇలా జరగాలి అని అనుకుంటారు, అలా జరగకపోతే దుఃఖం వస్తుంది. ఒకే విషయం మీకు దుఃఖం కలిగించొచ్చు, ఇంకొకడికి సంతోషం కలిగించొచ్చు. మీకు ఏదైనా నష్టం కలిగినప్పుడు దుఃఖం వస్తుంది, కానీ మీ శత్రువుకు చాలా సంతోషం వస్తుంది.

అలా ఒక విషయం తీసుకునే దాన్ని బట్టి ఉంటుంది. ఇప్పుడు కష్టమైన ధ్యానం చేయడం మీకు ఇష్టం, కాని కళ్ళు మూయడం కొందరికి

కష్టం. గమనించండి ప్రపంచంలో 99% మంది నిద్రలో తప్పించి కళ్ళు మూయలేరు. కానీ జ్ఞాని భౌతిక కార్యక్రమాల్లో పాల్గొన్నా, ఇష్టం ఉండి కాదు కర్తవ్యం కోసం పాల్గొంటాడు. కానీ జ్ఞాని దృష్టి ఎప్పుడు పరమాత్మ వైపే ఉంటుంది.

అందుకే జ్ఞాని కర్మలు రాకూడదని కోరుకుంటాడు. ఏ పని చేస్తే ఏ కర్మ వస్తుందో, ఏం మాట్లాడితే ఏ కర్మ వస్తుందో అని మాటలు కూడా తగ్గించుకుంటాడు. కొంతమంది లొడ లొడ వాగుతారు, వాగడం గొప్ప అనుకుంటారు. కానీ మాటల వల్ల కర్మలు పెరుగుతాయని జ్ఞానికి తెలుసు కాబట్టి కర్మలు తగ్గించుకోవడానికి మౌనంగా ఉంటారు.

అలాగే ఒక జ్ఞాని ఉన్నదానితో తృప్తిగా బ్రతుకుతాడు, కాని అజ్ఞాని ఎంతవచ్చినా తృప్తి ఉండదు. మీ జీవితంలో తృప్తిగా బ్రతుకు తున్నారు అంటే మీకు జ్ఞానం ఉన్నట్టే.

చూడండి మీ ఇంట్లో వాళ్ళు ఎవరైనా ధ్యానం చేయకపోతే వాడు చేయలేదు అంటారు. అసలు మీకు ఎందుకు? వాడు బాలాత్మ అయి ఉండొచ్చు, వాడి ఆత్మ స్థితి మీకు తెలియదు. కాని సహజంగా నా మొగుడు చేస్తే బాగుండును, మా అన్న చేస్తే బాగుండును, మా అమ్మ, నాన్న చేస్తే బాగుండును అనుకుంటారు, కాని ఎవరి ఆత్మ స్థితి ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు.

అలాగే అజ్ఞానులకు పత్రిగారు ఇష్టం కాకపోవచ్చు, కాని జ్ఞానులకి అలాంటి సద్గురువులు నచ్చుతూ ఉంటారు.

అందుకే ఆధ్యాత్మిక జీవితంలో మీ గురించి మీరు ఆలోచించుకోవాలి, అంతేకాని వాడు మీలాగ అయిపోవాలని అనుకుంటే అవ్వడు. మా ఆయన కూడా వస్తే బాగుండును అను కుంటారు, కాని ఆత్మస్థితి పెరగకుండా ఎలా వస్తారు? ఎవరికి టైం వచ్చినప్పుడు వాళ్ళు వస్తారు. మా రాఘవరావు గారు మొదట వచ్చారు, నేను వెనకాల వచ్చాను. ఏదైనా ముందు ఆలోచన

రాఘవరావుగారికి వస్తుంది, ఆచరణ నేను చేస్తాను.

ఒక జ్ఞాని ప్రతి విషయాన్ని గమనిస్తూ, సాక్షిగా చూస్తూ, తన ఎదుగుదల తాను చూసుకుంటూ ఉంటాడు. ప్రక్కవారి ఎదుగుదలకి ప్రయత్నిస్తాడు కానీ వారు ఎదగకపోతే వదిలేస్తాడు. ఎవరైనా "సాత్విక గుణంలోకి వస్తే కానీ సత్యం తెలుసుకోవడానికి ప్రయత్నించరు." అలాగే తమోగుణంలో ఉన్నవారు భగవంతుని తెలుసుకోవాలి అనుకోరు, కాని భగవంతుడు ఇచ్చేవి పొందాలి అనుకుంటారు.

అందుకే చాలామంది స్త్రీలు పూజ వదలడానికి భయపడతారు, మగవాళ్ళు వ్యాపారం వదలడానికి భయపడతారు. కాని ద్యానం అంటే భగవంతుని చేరుకోవడం అని ఎంత చెప్పినా, అప్పుడే టైం రాలేదు అంటారు. కారణం అజ్ఞానం. అంటే వారికి అర్హతలేదు అని తెలుసుకోవాలి. అందుకే ఎన్నో కారణాలు చెప్తారు, బాధ్యతలు అంటారు, బంధాలు అంటారు.

మీ మనసు ఒక పెద్ద చెత్త బుట్ట, అక్కర్లేని విషయాలన్నీ ఆ బుట్టలో వేస్తారు, అందుకే చెత్త బాగా గుర్తుంటుంది. కాని ఉదయం రాఘవరావు గారు చెప్పిన క్లాసు నెమరు వేయండి చూద్దాం, ఎంతమంది నెమరు వేస్తున్నారు?

మీరు మంచి చేస్తూ అందులో కొద్దిగా చెత్తకూడా వేస్తే మంచి కూడా చెత్త అవుతుంది. ఉదా:-ఒక కేజీ బంగాళాదుంప కూరలో కాకరకాయ వేస్తే కూర చేదయినట్టే. అలాగే ఉదయం మీరు విన్న విషయాలు గుర్తు రాదు, కాని ఈ చెత్త గుర్తొస్తాయి.

మరి ధ్యానం మంచిది అని తెలుసు, ఇది శరీరానికి మంచిదా? మనసుకు మంచిదా? బుద్ధికి మంచిదా? అంటే అన్నిటికంటే ఆత్మకు మంచిది. ధ్యానం చేసే వాళ్ళకే సత్యం బోధపడతుంది.

ధ్యానం ఎంత గొప్పదో! ధ్యానం ద్వారా ఎంత ఉన్నత స్థితికి వెళ్ళగలరో అన్నది తెలుసుకుంటే ధ్యానసాధన చేయాలనిపిస్తుంది. కాని ధ్యానం

చేసినంత మాత్రాన కర్మ దగ్ధం కాదు, జ్ఞానం పెరిగినప్పుడు మాత్రమే కర్మదగ్ధం అవుతుంది.

మీరు భూమి మీదకు వచ్చినప్పుడు స్వచ్ఛంగా తెల్ల పేపర్ లా వచ్చారు. కాని భూమి మీదకి వచ్చి తెల్ల పేపర్ నిండా మురికి అంటించారు, నల్లటి మచ్చలు అంటించారు. మరల ధ్యానసాధనలోకి వచ్చి అంటించిన మురికిని కడుక్కొని స్వచ్ఛమైన తెల్ల పేపర్ లాగా అయినప్పుడే పైలోకాలకి వెళ్ళడానికి అర్హత వస్తుంది.

మానవుడిగా పుట్టి ధ్యానసాధన చేయకపోతే దిగజారుతావు. మానవుడిగా పుట్టి ధ్యాన సాధన చేస్తే మహాత్ముడవై, మాధవుడవై ఎదుగుతావు. నువ్వు దిగజారుతావా? ఎదుగుతావా? అన్నది నీ చేతిలో పని. సృష్టిలో 84 లక్షల జీవుల్లో ఒక్క మానవుడికే దైవంగా ఎదిగే శక్తి ఉంది.

మీకు ఎప్పుడైతే సాధన లేదో మీరు పశువులే, ఎప్పుడైతే సాధన ఉందో పశుపతిగా మారుతాడు. మానవుడు పశువులా ఉండకూడదు పశుపతిగా ఎదగాలి. అదే జన్మ సార్ధకత అంటే?

మానవుడు ఒక "అజ్ఞానిగా పుట్టడం తప్పు కాదు, అజ్ఞానిగా చనిపోవడం తప్పు". ప్రతివాళ్ళు పుట్టుకతో అజ్ఞానులే, కానీ వాడు జ్ఞానం పొందకుండా చచ్చిపోతే మళ్ళా, మళ్ళా పుడతాడు...

ఒక్క సాధన వల్ల మాత్రమే అహంకారం తగ్గించుకుంటూ ఉంటారు. ఎంతగా అహంకారం తగ్గించుకుంటారో అంత ఎదుగుతారు. మాధవత్వం కోసమే మీరు భూమి మీదకు వచ్చారు.

సముద్రం అంత దుఃఖం ఉన్నా, సద్గురువు వస్తే జ్ఞానం అనే నౌక ఎక్కి దుఃఖం అనే సముద్రాన్ని దాటవచ్చు.

ఎవరికైనా నువ్వు ఇవ్వగలిగి నప్పుడు నువ్వు యజ్ఞమయ జీవితం గడుపుతున్నట్టు లెక్క. నీది ఎవరికైనా ఇవ్వగల మనసత్వం నీకు వస్తే, నువ్వు

భగవంతుడికి అత్యంత ప్రీతి పాత్రుడవు అవుతావు. ఎదుటివాడు ఆనందంలో ఉంటే మీరు ఈర్ష్య పడటం కాదు, ఎదుటివాడు ఆనందంగా ఉన్నప్పుడు మీరు ఆనందపడితే, ఇంకా గొప్ప ఆనందం వస్తుంది.

అందుకే మహాత్ములు తాను కష్టపడినా ఎదుటివాడు ఆనంద పడాలని చూస్తారు. ఎదుటివాడు ఆనంద పడుతున్నప్పుడు నువ్వు ఈర్ష్యతో ఉంటే నీ ఆనందాన్ని నువ్వే పోగొట్టుకున్నట్టు, నీ దుఃఖాన్ని నువ్వే తెచ్చుకున్నట్టు. ఆనంద పడ్డావా! నీకు పరమానందం వచ్చే అవకాశం ఉంది.

ఈ ధ్యాన జీవితంలోకి వచ్చాక ఎదటివాడి నుంచి రావాలని కోరుకో కూడదు. ఇవ్వడానికి ఏదైనా అంటే సమయమైనా, డబ్బైనా, జ్ఞానమైనా, వాక్కు అయినా ఏదైనా ఇవ్వచ్చు. ఒక పుస్తకం జీవితాన్ని మార్చేయవచ్చు. చిన్నప్పుడు ఒకసారి అరబిందో జాతకం చూసినప్పుడు ఒక యోగి అయినా అవుతాడు లేదా పెద్ద ఆఫీసర్ అయినా అవుతాడు అని ఉంది. వాళ్ళ నాన్నగారికి ఆఫీసర్ అవ్వాలి అని ఆశయం, అందుకని ఆయన అరబిందోని చదువు కోసం పంపించేసాడు.

అరబిందో కలకత్తా నుంచి వచ్చాడు. అప్పుడు ఇండియాలో చాలా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి, బ్రిటీష్ వారు మన వాళ్ళమీద దాడులు, అరెస్టులు చేసేవారు, అందులో ఈయన పాల్గొనే వాడు. బ్రిటీష్ వారు ఈయన్ని అరెస్ట్ చేసి చెన్నై జైల్ కి పంపించారు.

అది ప్రూవ్ అయ్యి అరబిందోకి ఉరిశిక్ష వేశారు. ఆ రాత్రి ఎవరో ఆయనకు భగవద్గీత తెచ్చి ఇచ్చారట, ఆయన భగవద్గీత తెల్లవార్లు చదివారట అరబిందో. అందులో "అహమాత్మ గుడా కేశ సర్వభూతాశయస్థిత:" అనే శ్లోకం యొక్క అర్థం కూడా ఆయన చదవడం జరిగింది. అందులో అందరిలో ఉన్నది ఆత్మే అని చెప్పబడింది.

మరునాడు అరబిందోని కోర్టుకి తీసుకొచ్చినప్పుడు ఈయనని నువ్వు హత్య చేశావా? అని అడిగితే నేను చంపినోడు కృష్ణుడే, మీరు కృష్ణుడే, వాడు కృష్ణుడే, అని మొదలుపెట్టాడట అరబిందో, ఎవరైనా కృష్ణులే, అందరిలోను ఉన్నది కృష్ణ స్వరూపమే కదా? ఆ చైతన్యమే కదా ఉన్నది అన్నాడట.

జడ్జిగారు అరబిందో మాటలు విని ఈయన అందరిలోను కృష్టుడిని చూస్తున్నాడు. అందరిని కృష్ణుడు, కృష్ణుడు అంటున్నాడు. ఇతను ఏమి చంపుతాడు? వదిలేయండి అన్నారట. అంటే ఒక్క పుస్తకం ఆయన జీవిత దశనే మార్చేసింది.

అలా మీరు ఎవరికైనా ఈ ఆత్మజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు ఇస్తే పరమ రాక్షసుడైనా! భగవంతుడు ఎక్కడో ఉన్నాడు, విగ్రహాల్లో ఉన్నాడు, గుడిలో ఉన్నాడు అన్న అపోహతో తప్పులు చేస్తున్న వాళ్ళు, భగవంతుడు నాలోనే ఉండి, నేను చేసే తప్పులు చూస్తున్నాడు అని తెలుసుకున్న రోజున తప్పులే చేయరు. కోరికలు, ఆశలు మనసువే. మీరు ధ్యానపరంగా, జ్ఞానపరంగా ఎదగాలి అన్న కోరిక గొప్పదే.

కానీ ప్రాపంచిక కోరికలు కోరితే అజ్ఞానంలో ఉన్నట్టే. అవి మనల్ని వెనక్కి తీసుకువెళ్ళి బంధాల్లో ఇరికించి, బందీని చేసి, బాధలో ముంచి జన్మలను పెంచుతాయి, బంధం ఉంటే శోకమోహాలు, రాగద్వేషాలు ఉంటాయి.

నావాడు అనుకున్నవాడు తప్పు చేస్తే ఏమీ మాట్లాడడు. కానీ నావాడు కానివాడు తప్పు చేస్తే ఎంతో దండిస్తారు. మరి అందరూ ఆత్మలని నేర్చుకుని ఇలా ప్రవర్తిస్తే ఇంకా బంధంలో ఉన్నట్టే.

మా అబ్బాయి ధ్యానం చేయడు, పరమ మూర్ఖుడు అని చెప్తారు, ధ్యానంలోకి రాకముందు నువ్వు మూర్ఖురాలివే కదా?

నువ్వు మూర్ఖత్వం నుంచి మోక్షత్వం వైపు వస్తున్నావుగా? వాళ్ళూ

టైం వచ్చినప్పుడు వస్తారు. అంతేకానీ విమర్శించకూడదు. విమర్శించినా అజ్ఞానమే, ఆశ పడినా అజ్ఞానమే, కోరిక ఉన్నా అజ్ఞానమే, తృప్తి లేకపోవడము అజ్ఞానమే.

తృప్తి ఉంటేనే నీకు ధ్యానం బాగా కుదురుతుంది, అసంతృప్తితో జీవిస్తే సాదన కూడా కుదరదు. అందుచేత ఏది వచ్చినా అంగీకరించాలి. ఎందుకంటే? ఎవరి జీవితంలోను ఒక్కసారే మార్పు రాదు. ఈ ధ్యాన జీవితంలోకి రావడమే కష్టం, నిలవడం ఇంకా కష్టం. ఎందుకంటే మీకు పరీక్షల మీద పరీక్షలు వస్తుంటాయి, ముందు మీ సంసారంలో నుండి వస్తాయి, బంధువుల నుండి వస్తాయి.

వాళ్ళు ఏమంటారంటే? వీళ్ళు ధ్యానాలు అంటూ పూజలు మానేసారు, కానీ వీళ్ళకి పండగ లేదు, పబ్బం లేదు అంటారు. అలా అనడం ఇంట్లో వాళ్ళకి అలవాటు అయిపోయింది. అలా ఇంట్లోవాళ్ళు ఎన్ని చెప్పినా మీరు పట్టించుకోకపోతే వాళ్ళు మిమ్మల్ని వదిలేస్తారు.

సహజంగా ధ్యాన జీవితంలో కర్మలు ఎక్కువగా వస్తాయి అనిపిస్తుంది. కాని ఎవరైనా ముందే పైన నిర్ణయించుకుని వస్తారు. తెచ్చుకొన్న కర్మలను బట్టి రోగాలు, బాధలు, కష్టాలు, కన్నీళ్లు అన్నీ ఉంటాయి. ఇవన్నీ ఎంచుకుని వచ్చిన కర్మలే కదా? ఎవరైనా జీవితం ఇలా ఉండాలి అని నిర్ణయించుకొని వచ్చినవారే అని పత్రీజీ చెప్పారు.

నేను ధ్యానంలోకి వచ్చి సత్యం తెలుసుకున్నాను, కాబట్టి 80% కాలిపోయినా నేను ధ్యానం వదలలేదు, ఎందుకంటే నేను అనుభవిస్తానని నిర్ణయించుకున్నప్పుడు జీవితం అలాగే ఉంటుంది.

ధ్యానంలోకి వచ్చినా ఇంత అనుభవించాలా? ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి వెళ్ళాలంటే ఇన్ని బాధలు పడాలా? అని అనుకుంటారు తెలియని

వాళ్ళు. అసలు కష్టాలు వస్తున్నాయి అంటే మీ కర్మలు పోతున్నాయి అని అర్థం. ఇది మీకు తెలిసినప్పుడు ఏ బాధ ఉండదు. కానీ కష్టాలు వస్తున్నాయి అనుకుంటే బాధ ఉంటుంది, కర్మ పోతుంది అనుకుంటే బాధ ఉండదు. రెండిటికీ తేడా అది.

మీరు ప్రాపంచికంగా ఉంటే కష్టం వచ్చింది అనుకుంటారు, కాని ఆధ్యాత్మికంగా ఎదిగినప్పుడు కర్మలు పోతున్నాయి అని అర్థమవుతుంది. అసలు కర్మలు ఉంటే మళ్ళా జన్మలే కదా? ఈ జన్మలో మీరు అనుభవించి కొన్ని పోగొట్టుకుంటారు.

ఎవరైనా యోగ జీవితంలోకి వచ్చినవారు ఒక పెద్ద కష్టం, ఒక ఇష్టం ఎంచుకుని వస్తారు అని పత్రిగారు చెప్పారు. మరి పెద్ద ఇష్టము? అంటే లోక కళ్యాణకరమైన పనులు చేయాలనే ఇష్టం, భరించలేని కష్టం అనుభవిస్తామని ఎంచుకుని యోగి వస్తాడు అన్నారు.

అందుచేత ప్రతి యోగి జీవితం కష్టాలతోనే ఉంటుంది. అసలు కష్టాలతో బంధం వదులుకుంటాడు, కష్టాలతో కర్మలు పోగొట్టుకుంటాడు. అందుకే యోగజీవితం అంత సుఖమైన జీవితం కాదు. కాని యోగి ప్రాపంచికంగా ఎన్ని కష్టాలు పడినా శాశ్వత ఆనందాన్ని కలిగించే పరమాత్మ స్థితికి చేరుకుంటాము అనే విషయం తెలుసుకోవాలి.

ఈ భూమి మీద సుఖాలు,సంతోషాలు ఉన్నాయి, కాని ఆనందం లేదు. కాని ఆనందం పరమాత్మ దగ్గరే ఉంది. గమనిస్తే పరమాత్మ ఎంత శాశ్వతుడో, ఆనందం కూడా అంతే శాశ్వతం. అంతేకాదు ప్రపంచానికి, సృష్టికి నశింపు ఉంది, పరమాత్మకి నశింపు లేదు.

అలాగే సృష్టిలో సుఖాలు, భోగాలు, సంతోషాలు వస్తాయి, మళ్ళీ పోతాయి. అందుకే చూడండి అబ్బాయి పుట్టినా, అమ్మాయి పుట్టినా, ఆస్తులు, డబ్బు, సంపాదించినా సంతోషంగా ఉంటుంది, కాని కొడుకులు పంచుకుని

మీకు వాటాలు వేస్తారు చూడండి, అప్పుడు బాధ వస్తుంది.

అప్పుడు కొడుకు పుట్టాడు అని సంతోషపడ్డావు, అమెరికా పంపుతున్నానని సంతోషపడ్డావు. ఇప్పుడు నీకు అనారోగ్యం వచ్చింది. నేను ఉన్నానమ్మా! అని నీ కొడుకు రాగలడా? రాలేదుగా? అంతేకాదు నీ కొడుకు చివరి టైంలో చూడడానికి రాకపోతే మళ్ళీ దుఃఖం వస్తుంది. అంటే ఆ సంతోషం ఎందుకు లేదు? అందుకే సుఖము, సంతోషము తాత్కాలికం అని తెలుసుకోండి. కాని భగవంతుడి దగ్గర ఉండేది ఆనందం, అది ఒక్కటే శాశ్వతం.

అందుకే ఋషులు కష్టపడి చేసే సాధనలు అన్నీ శాశ్వత ఆనంద స్థితి కోసమే! అందుకే వాళ్ళు ఎక్కువ కళ్ళు మూసుకుంటారు. కారణం అసత్యంలో నుంచి సత్యంలోకి రావాలని. వారు కళ్ళు విప్పితే కనిపించేది అంతా అసత్యమే, కాని కళ్ళు మూస్తేనే సత్యం దొరుకుతుంది.

లేనిది ఉన్నట్టుగా కనిపించేది అసత్యం, లేనిది లేదని తెలుసు కోవడమే సత్యం. లోకమంతా పెద్ద మాయ, లేనిదంతా ఉన్నట్టుగా భ్రమ కలిగిస్తుంది.

ఈ సృష్టి ఉందనుకుంటున్నారు, కాని కళ్ళు మూసుకుంటే సృష్టి ఉండదు. ఈ సృష్టి సృష్టికర్తలో లయం అయినప్పుడు ఏమీ ఉండదు. అలాగే నువ్వు కళ్ళు మూసుకున్నప్పుడు ఏమీ ఉండదు మహా శూన్యం.

మీకు ఆలోచనలు వస్తే ధ్యానం కుదిరినట్లు కాదు, ఆలోచన లేని స్థితిలో మీరు కూర్చోగలిగితేనే ధ్యానం కుదిరినట్టు, అప్పుడే నీకు శక్తి వస్తుంది. నాకేం కనబడట్లేదు? అంటే ఏం కనపడాలి? లేనిది ఏమి కనపడుతుంది? ఉంటే కదా కనబడేది. ఈ సృష్టి లయమైపోతే ఏది ఉండదు. నువ్వు కళ్ళు మూసుకున్నప్పుడు ఆలోచనలు లేకుండా అట్లాగే ఉంటే, సత్యంతో అంటే ఆత్మతో ఉన్నట్టే!

నువ్వు కలలో పెద్ద మహారాణివి అని కల వచ్చింది, అది నిజమా?

కాదు. కారణం కళ్ళు విప్పితే తెల్లారుతుంది, అంట్ల గిన్నెలు కనిపిస్తాయి.

అంటే కలలో మహారాణివి, కాని ఇలలో పని మనిషే కదా? మీరు వంట ఇంట్లోకి వెళ్ళగానే అమ్మగారు అని పిలుస్తుంది. కలలో మహారాణివే. ఇలలో కాదుగా? అలాగే ఈ ఇలలో నీకు అన్నీ కనిపిస్తున్నాయి, కానీ మనసు శూన్యమైనప్పుడు ఏదీ లేదు.

ఏమీ లేని చోట నీకు భ్రాంతి ఎక్కడ? బంధం ఎక్కడ? అక్కడ ఏముంది? కొడుకు కనిపించడు, మనవరాలు కనిపించదు, కూతురు కనిపించదు, మొగుడు లేడు, పెళ్ళాం లేదు, పిల్లలు లేరు, నగలు లేవు, చీరలు లేవు, ఏమిలేవు. అంటే నువ్వు కళ్ళు మూసుకొని శూన్యంలో వున్నప్పుడు పరమాత్మలో లయమైనప్పుడు ఏమి ఉండవు.

చూడండి మీరు కూర్చున్న రెండు మూడు గంటలు ఆలోచనలు వస్తున్నాయి అంటే మనసు పని చేస్తుందని లెఖ్ఖ, ఏమీ లేని స్థితిలో శూన్యంలో కూర్చున్నారు అంటే నువ్వు మనసును దాటినట్టు. ఆ మనసును దాటి ఆత్మ దగ్గరికి చేరేటప్పటికి అక్కడ సంఘటనలు లేవు, సంసారం లేదు, సంఘము లేదు, ఏమీలేవు. అందుకే నువ్వు నిశ్చింతగా ఎన్ని గంటలైనా అలా కూర్చుండి పోతావు. ఆలోచనలు వస్తుంటే చిరాకుగా ఉంటుంది, రెండు గంటలు అన్నారు, కాని ఇంకా ఓకే చెప్పట్లేదేమిటి? అనుకుంటారు.

కుక్క భౌ, భౌమని అరుస్తుంది. కర్ర తీసుకుంటే నోరు మూసుకుంటుంది. కర్ర తీయనంతసేపు అరుస్తుంది, మీదకు రావడానికి చూస్తుంది. కానీ కర్ర తీసుకుని కొట్టక్కర్లేదు, కర్రను చూస్తేనే దానికి భయం.

మీరు కూడా మనసును కంట్రోల్ చేయాలంటే శ్వాస అనే కర్రను తీసుకోవాలి. శ్వాసను పట్టుకోగా, పట్టుకోగా నిశ్శబ్దం ఆవరిస్తుంది. ఆ నిశ్శబ్దంలో నుంచే అంతరంలో ఉన్న శబ్దాన్ని వినగలిగే స్థితి వస్తుంది.

సృష్టిలో ఏదైతే ఉందో మానవ దేహంలో కూడా అదే ఉంది. సృష్టిలో

మొట్టమొదట పుట్టింది శబ్దం, అది మానవుని శరీరంలోనే ఉంది. ఆ సృష్టిలోని ఓంకారశబ్దం వినగలిగితే మీరు ఆత్మ దగ్గరికి చేరుకున్నట్టే.

అలా నిశ్శబ్దంలో అంతరాంతరంలోకి వెళ్ళగలిగితే ఓంకారశబ్దం వినగలరు. మీరు ఇంకా, ఇంకా లోతుల్లోకి వెళ్ళగలితే అంతులేని ఆత్మానందాన్ని అనుభూతి చెందగలరు.

ఈ స్థితి సాధించాలి అంటే బాహ్య విషయాలపట్ల ఉపేక్ష వహించాలి. అంటే బాహ్య విషయాలు ఎన్ని వింటున్నా వాటిమీద ఆసక్తి లేకుండా అనాసక్తితో ఉండాలి. అంటే అన్నిటితో, అందరితో ఉన్నా దేని మీద ఆసక్తి ఉండకూడదు.

ఎదుటివాడు మనల్ని తిట్టినా, పొగిడినా మనకు ఒక్కటే. మనకు నచ్చినట్టు వాడు ఉండడు, వాడికి నచ్చినట్టు మనం ఉండం. ఎప్పుడూ ఘర్షణే ఉంటుంది, మీ జీవితంలో ఘర్షణ ఉంటేనే వైరాగ్యం వస్తుంది. ఆ ఘర్షణ లేకపోతే మీ పిల్లలు మీ మాట విని, మీ భర్త మీ మాట విని, పెళ్లాం మీ మాట వింటే ఇంక భగవంతుడు ఎందుకు? నా జీవితం ఎంత హ్యాపీగా ఉందో, నాకు ఇంతకంటే ఏమి వద్దు అనిపిస్తుంది.

కాని ఇక్కడే మళ్ళీ, మళ్ళీ జన్మలు ఉంటాయి. అలా జన్మలు వస్తే కష్టాలు కూడా వస్తువుంటాయి. అందుచేత జన్మలు తగ్గించుకుని, జన్మ లేని స్థితి పొందే సాధన మొదలు పెట్టాలి.

మీరు మీ స్వస్థితి మర్చిపోయారు, మీ స్వస్థితి అంటే మీరు ఆత్మ. అంతేకాని ఈ దేహం కాదు, మనసు కాదు. కాని ఈ తొడుగు నేను అనే భ్రాంతిలో ఉన్నారు. కాబట్టి ఈ బంధాలు, బాధలు అనే దేహ స్థితిలో ఉన్నారు.

ఆత్మ గురించి తెలుసుకున్నారు కానీ మీకు అనుభవం రాలేదు. మీరు ఆత్మను చేరుకుంటూ, ఆత్మ స్థితిలో ఉండి, ఆత్మను దర్శించగలిగితే అంతకంటే ఆనంద స్థితి ఉండదు. ఆ అనుభూతి కోసమే ధ్యాన సాధన.

పత్రిగారు 'ధ్యానం సర్వరోగ నివారిణి' అనేవారు. అలా అని

మందులు మానేసి ధ్యానంలో కూర్చుంటాను అంటే చాలా రాంగ్ ఇప్పటి రోజుల్లో. నాకు బాగోక 40 రోజులు అయింది అయినా ఇంకా తగ్గలేదు. ఈ రోజుల్లో అంతసేపు కూర్చుని ధ్యానం చేసే పరిస్థితులు ఉండవు ఎవరికీ.

కృష్ణుడి కొడుకు సాంబుడికి కుష్టు వ్యాధి వచ్చింది. అప్పుడు అందరిలాగే కృష్ణుడు కూడా బాధ పడ్డాడట. అప్పుడు సాంబుడు 11 సంవత్సరాలు సూర్యుడి ఎదురుగా కూర్చుని ధ్యానం చేసి, ఆ కుష్టు వ్యాధిని పోగొట్టుకున్నాడట. కానీ అందగాడిననే అహంకారంతో యదువంశం నాశనానికి కారణం అయ్యాడు.

ఆరోగ్యం కోసం ధ్యానం చేస్తే జ్ఞానం లేనప్పుడు వంశ నాశనానికి కూడా కారణం అవుతారు. అందుకే ఆరోగ్యం కోసం ధ్యానం సాంబుడి ధ్యానంలా ఉంటుంది. ఆత్మజ్ఞానం కోసం చేసే ధ్యానం వల్ల సరిగ్గా ఎదుగుతారు.

ఆరోగ్యం గురించి, మానసిక ప్రశాంతత గురించి ధ్యానం చేస్తే జ్ఞానం పెరగదు. ధ్యానానికి ముందు ఎలాంటి దుర్గుణాలు ఉంటాయో! ధ్యానంలోకి వచ్చినా అవే ఉంటాయి. ఆత్మజ్ఞానం కోసం ధ్యానం చేస్తే దుర్గుణాలను వదలగొట్టుకుంటారు.

అజ్ఞానిస్థితి నుంచి జ్ఞానిగా ఎదుగుతూ ఇంకా, ఇంకా మంచిగా మీ ప్రవర్తన ఉండాలి, పది మందికి ఆదర్శంగా ఉండాలి.

## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

a) Channel Name : Tatavarthy Veera Raghava Rao. ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

b) అలాగే PMC వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క YouTube Channel ప్రారంభించారు. Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao

c) తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు Tatavarty Spiritual Trainees ఛానెల్‌లో చూడండి.

d) Direct గా YouTube app లోకి వెళ్ళి search bar లో Tatavarthy Veera Raghava Rao అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించకముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం- రూ.120/-
10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) గీతాసందేశం - రూ.120/-
12) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
13) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం?- రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు- రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు-రూ.90/-
23) కర్మ సిద్ధాంతం - రూ.80/-
24) ధ్యానమంటే ? - రూ.80/-
25) త్రివిధాలు - రూ.80/-
26) ఉత్తమ పురుషుడు - రూ.80/-
27) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
28) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
29) జ్ఞాన జ్యోతి - రూ.70/-
30) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
31) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
32) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
33) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
34) బుద్ధుని సందేశాలు - రూ.70/-
35) భూతదయే దైవత్వం - రూ.70/-
36) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
37) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
38) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
39) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/-
40) మానవునిలోని చెడు -రూ.70/-
41) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు -రూ.70/-
42) చివటం అమ్మవారి సందేశాలు - రూ.70/-
43) మోక్షం అంటే? - రూ.70/-
44) కబీరు సందేశాలు-1 -రూ.70/-
45) మనసు-1 - రూ.70/-
46) మనసు-2 - రూ.70/-
47) కబీరు సందేశాలు-2 -రూ.60/-
48) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
49) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
50) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
51) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
52) అతీంద్రియ శక్తులు - రూ.60/-
53) ఆలోచించండి - రూ.60/-
54) నిర్వాణ మార్గం - రూ.60/-
55) ధ్యానులకు సూచనలు - రూ.60/-
56) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
57) మమకారం - రూ.60/-
58) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 - రూ.60/-
59) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 - రూ.50/-
60) మాస్టర్‌గా ఎదగాలంటే? -రూ.50/-
61) భగవంతుని ఇష్టులవ్వాలంటే-రూ.50/-
62) సంకల్పమంటే? - రూ.50/-
63) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
64) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
65) మూడురకాల భవిష్యత్తులు -రూ.50/-
66) అరిహంత్ - రూ.50/-
67) బుద్ధి వికసించిన వారి ప్రవర్తన - రూ.50/-
68) భార్యభర్తలు గొడవ పడకూడదంటే - రూ.40/-
69) విదురుని సందేశాలు -రూ.40/-
70) మూడురకాల జీవితాలు -రూ.40/-
71) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
72) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
73) బ్రహ్మం అంటే? -రూ.40/-
74) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం -రూ.40/-
75) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
76) మహాత్ముల సందేశాలు - రూ.40/-
77) సత్యం - రూ.40/-
78) చక్రాలు - రూ.40/-
79) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
80) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
81) మౌన ధ్యానం - రూ.40/-
82) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
83) శాకాహారమే మానవాహారం - రూ.15/-
84) అహింస మరియు శాఖాహారం- రూ.15/-



మానవుడు ధన్యుడు ఎట్లా అవుతాడు అంటే కబీర్ ఏమన్నారంటే? అందరూ ధ్యాన సాధన చేసి ఆత్మ సాక్షాత్కారం పొందే ప్రయత్నం చెయ్యాలి.

కబీర్ 3 పాయింట్లు చెప్పారు

1. ప్రతి వాడి శరీరంలో ఆత్మగా పరమాత్మే ఉన్నాడు.

2. మరి ఆయన కోసం ప్రయత్నించడమే ధన్య జీవితం

3. ఆ పరమాత్మ ప్రకటితమైతే అంటే దర్శనం కలిగితే వాడు ధన్యుడు అన్నాడు.

ఇప్పుడు మీరు శరీరంలో ఉన్న ఆత్మ కోసమే రోజు ధ్యానం చేస్తున్నారు, ప్రయత్నిస్తున్నారు. ధన్యజీవితం అంటే ఇదే. అలా జీవిస్తూ ఆత్మ కోసం ప్రయత్నిస్తే! చివరకు ఆత్మ దర్శనం పొంది ధన్యుడిగా ఎదుగుతారు అని కబీర్ చెప్పడం జరిగింది.

- బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

రూ.60/-

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మిగార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
| --- | --- | --- | --- | --- |